www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 229 | గురువారం | 8 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



మే 23,24 తేదీల్లో ఐసెట్ పరీక్షలు

- దరఖాస్తులకు ఏప్రిల్ 30 గడువు
- మార్చి 6 నుంచి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునే అవకాశం

మన తెలంగాణ/ కెయుక్యాంపస్: ఎంబిఎ,ఎంసిఎ కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించే తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టిఎస్ఐసెట్) 2018 షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ తరువాయి 11లో

దేశాన్ని ముంచారు

- భజనపరులను ప్రోత్సహించి అభివృద్ధిని బలితీసుకున్నారు
- పటేల్‌కు బదులు నెహ్రూను ప్రధానిని చేసి కశ్మీర్‌ను కల్లోలపర్చారు
- బ్యాంకు రుణాల ఎగవేతలకు కారణమయ్యారు

పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నన్నాళ్లు గాంధీ కుటుంబాన్ని శ్లాఘించేందుకే సమయన్నాంతా వృథా చేశారని, తద్వారా అభివృద్ధి పరంగా భారత్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని పార్లమెంట్ వేదికగా దుయ్యబట్టారు. బుధవారం నాడు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోడీ ఉభయ సభల్లో సుదీర్ఘంగా మాట్లాడారు. ఆద్యంతం కాంగ్రెస్ విధానాలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. దేశ విభజనకు కాంగ్రెస్సే ప్రధాన కారణమన్నారు. 18 కమిటీల తీర్మానాలను పక్కనబెట్టి ఆనాడు సర్దార్ పటేల్‌ను కాదని నెహ్రూను ప్రధానిగా తెరపైకి తెచ్చారని.. ఇదేనా కాంగ్రెస్ అనుసరించిన ప్రజాస్వామ్యం అని పశ్నించారు. సర్దార్ పటేల్ ప్రధాని అయ్యుంటే ఈనాడు కశ్మీర్ పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఒక యువకుడు నామినేషన్ వేస్తానని ముందుకు వస్తే అతన్ని అడ్డుకున్నారని పరోక్షంగా రాహుల్ ఎన్నికను ఎద్దేవా చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం ఆగస్టు 15, 1947లోనే వెల్లానుకున్నట్టు, దాన్ని కాంగ్రెస్ పార్టీ, నెహ్రూయే తీసుకువచ్చినట్టు ప్రజల్లో ప్రచారం చేసుకుంటున్నారని, అనాది నుంచి భారతీయుల రక్తంలోనే ప్రజాస్వామ్యం ఉందన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత, కర్నాటకకు చెందిన మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి 'మీరు కర్నాటకకు చెందిన వారు కాదా? కనీసం మీకు బసవేశ్వరుడు గుర్తు లేరా? వారి గురించి మీరు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే అనుభవ మండపాలను స్థాపించారు. వాటిల్లో ప్రజాస్వామ్యబద్ధంగా మహిళలకు అత్యధిక ప్రాధాన్యాన్నిచ్చారు. దీన్ని మరిచిపోయారా మీరు' అని ప్రశ్నించారు. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోయిన తర్వాత ఖర్గే ఎక్కడ ఉంటారోనని మోడీ పేర్కొన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలోనే బ్యాంకుల నిరర్థక మొండి బకాయిలు పేరుకు పోయాయని, అవి యుపిఎ చేసిన పాపాలని అభివర్ణించారు. కాంగ్రెస్ పాలకులు బ్యాంకుల్లో మొండి బకాయిలను పెంచి పోషించారని, ఇది ఆర్థిక వ్యవస్థకు చేయాల్సినంత నష్టాన్ని చేసి పెట్టిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దగ్గరి వ్యక్తులకు విచ్చలవిడిగా రుణాలను మంజూరు చేసి ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారని, ఇదంతా ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. తాము 2014లో ప్రభుత్వంలోకి వచ్చినప్పటి నుంచి ఆధార్‌ను శాస్త్రీయంగా ఉపయోగిస్తూ అవినీతికి అడ్డుకట్ట తరువాయి 11లో



ఎన్నికల కోసమే హడావుడిగా ఎపి విభజన : మోడీ 10

బడ్జెట్‌లో తెలంగాణకు దక్కిందేమీ లేదు : జితేందర్ రెడ్డి 10



ప్రజల ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండా ఇదేమి ప్రసంగం?

- ప్రధాని పార్లమెంట్‌ను బహిరంగ సభ అనుకున్నారా? : రాహుల్
- చెప్పినవే మళ్లీ చెప్పారు : సోనియా

న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌తో చేసుకున్న రాఫెల్ ఒప్పందంలో ఉన్న అవినీతిపరులను ప్రధాని నరేంద్ర మోడీ కాపాడుతున్నారని, ఆయన పార్లమెంటులో తమపై ఆరోపణలు చేయడం మాని రైతులపై, నిరుద్యోగంపై దేశప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రధాని చేసిన ప్రసంగంపై రాహుల్ స్పందించారు. ప్రధాని మోడీ గంటపాటు ప్రసంగించారు కానీ, రాఫెల్ ఒప్పందం గురించి ఒక్క మాటా మాట్లాడలేదు అన్నారు. ఆయనది వట్టి 'రాజకీయ, ప్రచార ప్రసంగమే'నని రాహుల్ గాంధీ అభివర్ణించారు. మోడీ తాను ప్రతిపక్ష నాయకుడు కాక ప్రధాని అన్న విషయం మరిచిపోయినట్టున్నారని కూడా విమర్శించారు. 'దేశ ప్రజలు ప్రధానిని ఎన్నో ప్రశ్నలు అడుగుతున్నారు. కానీ వాటికి ఆయన సమాధానం ఇవ్వడంలేదు. ఇక్కడ (పార్లమెంటులో) మీరు దేశప్రజలను ప్రశ్నించడం మాని వారడిగిన ప్రశ్నలకు బదులివ్వాలి' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే హక్కు ప్రధానికి ఉంది. అయితే తరువాయి 11లో

పెట్టుబడి సాయానికి ఆర్‌బిఐ నుంచి

అడ్వాన్స్ రుణం?

మన తెలంగాణ / హైదరాబాద్ : వర్షాకాలం నుంచి రైతులకు 'పెట్టుబడి సాయం' ఇవ్వాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇందుకు అవసరమయ్యేలా సుమారు ఆరు వేల కోట్ల రూపాయలను 'అడ్వాన్సు' రూపంలో రిజర్వుబ్యాంకు నుంచి సమకూర్చుకోనున్నట్లు సమాచారం. మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం మేర రిజర్వుబ్యాంకు నుంచి 'క్రెడిట్ పాలసీ'లో భాగంగా అప్పుల (బారోయింగ్) రూపంలో పొందే వీలు ఉంది. అయితే నాలుగు త్రైమాసికాలకు నాలుగు విడతలుగా విడుదలయ్యే ఈ డబ్బులో తొలి త్రైమాసికానికి సంబంధించి వచ్చే డబ్బును జూన్ చివరకు కాకుండా మే నెల మొదటి వారానికే విడుదల చేయాలని లేఖ ద్వారా కోరనున్నట్లు సమాచారం. ఈసారి బడ్జెట్ సుమారు రూ. 1.80 లక్షల కోట్లుగా ఉండవచ్చని అంచనా వేసిన ఆర్థికశాఖ సుమారు రూ. 27000 వరకు రిజర్వు బ్యాంకు నుంచి పొందే వీలుందని భావిస్తోంది. తొలి త్రైమాసికానికి వచ్చే రూ. 6500 కోట్ల (బడ్జెట్‌ను బట్టి మారవచ్చు)ను ముందుగానే ఇవ్వాలని కోరనున్నట్లు సమాచారం. మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం కింద సుమారు రూ.5675 కోట్ల మేరకు చెక్కుల ద్వారా పంపిణీ చేయాల్సి ఉన్నందున్నందువల్ల అప్పటికల్లా ఇవి రాష్ట్రానికి చేరేలా ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మాత్రమే స్పష్టమైన గణాంకాలు తెలుస్తాయి కాబట్టి ఆ తర్వాతనే రిజర్వు బ్యాంకుకు లేఖ రాయనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పెట్టుబడి పథకం'ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున దీన్ని 'ప్రత్యేక అవసరం'గా పరిగణించి ఏప్రిల్ చివర్లో లేదా మే మొదట్లోనే విడుదల చేయాలని రిజర్వు బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయనున్నదని ఆర్థిక శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఒకవైపు చెక్కుల ముద్రణ, మరోవైపు కరెన్సీ ఇబ్బందులు లేకుండా చూడడం తదితర అవసరాల కోసం ఇప్పటికే రిజర్వుబ్యాంకును, భారతీయ స్టేట్ బ్యాంకుతో సంప్రదింపులు జరిపిన రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు బడ్జెట్ తర్వాత ఈ డబ్బు కోసం ఆశ్రయించనున్నట్లు సమాచారం. రానున్నది ఎన్నికల బడ్జెట్ కాబట్టి రైతు పెట్టుబడి పథకంతో పాటు అనేక పథకాలను సమర్థవంతంగా అమలు తరువాయి 11లో



కంది రైతుకు భరోసా!



కేంద్రం ముందుకు రాకపోతే మొత్తం నిల్వల కొనుగోలుకు రాష్ట్రం యోచన

ఇప్పటికే పరిమితి దాటి 1.35 లక్షల టన్నులు సేకరణ

ధర లేనికారణంగా కొనుగోలు పరిమితిని 2 లక్షల టన్నులకు పెంచాలని కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ, అంత ఇచ్చేది కష్టమే అంటున్న అధికారులు

మన తెలంగాణ/ హైదరాబాద్: కందులను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేస్తే, రాష్ట్ర ప్రభుత్వమే రంగంలోకి దిగి ప్రభుత్వపరంగా కొనుగోళ్లు చేపట్టాలని భావిస్తోంది. సిఎం కెసిఆర్ కూడా ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం కేంద్రం అనుమతించిన ప్రకారం 1.13 లక్షల మెట్రిక్ టన్నుల కందులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంది. కానీ ఇప్పటికే కొనుగోళ్లు 1.35 లక్షల టన్నులకు చేరినట్లు రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఇదే విషయమై సిఎం కెసిఆర్, మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి రాధా మోహన్ సింగ్‌కు లేఖ రాశారు. మార్కెట్‌లో కందులకు ధర లేనందున, కేంద్ర ప్రభుత్వమే 2 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అందుకు అనుమతినివ్వాలని కోరారు. ఈ లేఖపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినప్పటికీ, పరిమితి పెంపుపై అధికార ఉత్తర్వులు ఇంకా రాలేదు. కేంద్రం ఇప్పటికే పరిమితి పెంచిందని, మళ్లీ ఏమైనా పెంచితే 1.50 లక్షల టన్నుల వరకే ఉండవచ్చునని 2 లక్షల టన్నులకు ఇవ్వదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో రైతులకు నష్టం రావొద్దంటే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు చేపట్టాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. వాస్తవానికి అర్థ, గణాంక శాఖ(డిఇఎస్) ముందస్తు అంచనాల ప్రకారం మద్దతు ధరకు కొనుగోలు పథకం (పిఎస్ఎస్) కింద సేకరణకు కేంద్రం అనుమతిస్తుంది. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 6.20 లక్షల ఎకరాలలో కంది సాగైందని, 1.34 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని డిఇఎస్ తొలి అంచనాను కేంద్రానికి పంపింది. ఈ లెక్కల ఆధారంగా పిఎస్ఎస్‌లో 40 శాతం కోటా ప్రకారం 53,600 టన్నులను ఫిబ్రవరిలోగా కొనడానికి నాఫెడ్‌కు కేంద్రం అనుమతించింది. ఆ తరువాత కందుల దిగుబడిపై రెండో ముందస్తు అంచనాలను డిఇఎస్ కేంద్రానికి పంపింది. దీని ప్రకారం సాగు విస్తీర్ణం 7.28 లక్షల ఎకరాలకు, దిగుబడి 2.84 లక్షల టన్నులకు పెరిగినట్లు పేర్కొంది. దీనిలో 40 శాతం నిబంధన కింద 1.13 లక్షల టన్నుల కొనుగోలుకు కేంద్రం అనుమతిచ్చింది. కానీ పాత నిల్వలు తక్కువ ధరకే మార్కెట్‌లోకి వస్తుండటంతో ధర ఇప్పట్లో పెరిగేలా లేదని మార్కెటింగ్ శాఖ అధ్యయనంలో తేలింది. కొనుగోలు పరిమితిని 2 లక్షల టన్నులకు, గడువు తేదీని మార్చి 31 వరకూ పెంచాలని సిఎం కేంద్రాన్ని కోరారు.

కుంచె పోటు



తప్పేముంది, టి, పకోడీలమ్మే వారికి అలా ఉపాధి మార్గం చూపిస్తున్నాం!

కృష్ణ, గోదావరి బోర్డుల పరిధులపై 9న కీలక భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్: గోదావరి, కృష్ణానది బోర్డుల పరిధిపై ఈ నెల 9వ తేదీన ఢిల్లీలో కీలక సమావేశం జరుగనుంది. ఈ మేరకు కేంద్ర జలవనరుల శాఖ రెండు బోర్డులకు సమాచారం ఇచ్చింది. 15వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో సమావేశమున్న తరుణంలో అంతకు ముందే అంతర్గతంగా సమావేశమవుతున్నారు. 9న బోర్డుల పరిధి, ఇప్పటి వరకు జరిగిన పరిణామాలు, ఎపి, తెలంగాణ వాదప్రతివాదాల గురించి కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శికి ముందస్తు సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. ఈ చర్చల్లో వెలువడే అభిప్రాయాలకు తరువాయి 11లో

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ తమ్మినేని 11



1500 మంది ఐఎఎస్‌ల కొరత 10

రోడ్డు ప్రమాదంలో మోడి భార్యకు గాయాలు

ఆధార్‌తో పేచీ ఏమిటి?

'ఒకే దేశం, ఒకే గుర్తింపు'లో అభ్యంతరకరం ఏమున్నది

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆధార్' పథకాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం నాడు ప్రశ్నించింది. ఆధార్ ద్వారా ఒకే దేశం, ఒకే గుర్తింపు సాధించదలచడంలో తప్పేమున్నదని అడిగింది. ఆధార్ పథకాన్ని, దానికి మూలమైన 2016 చట్టాన్ని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రభుత్వం మంగళవారం నాడు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అధ్యక్షతన గల ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు సవాల్ చేసింది. భారతీయత అనేది ఒక ప్రత్యేక గుర్తింపుకు సంబంధించినది ఎంత మాత్రం కాదని పేర్కొన్నది.

నేతన్నలతో గవర్నర్



బుధవారం నాడు భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల హ్యాండ్లూమ్ పార్కును సందర్శించి అక్కడి కార్మికులతో ముచ్చటిస్తున్న గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ 3

ఎస్‌సి వర్గీకరణకు బిజెపి కట్టుబడి ఉంది



మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణకు బిజెపి కట్టుబడే ఉన్నదని, కాంగ్రెస్ వైఖరిపైనే తమకు విశ్వాసం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. వర్గీకరణకు మద్దతుగా ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయించాలన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనపై అసంతృప్తితోనే దళితులు బిజెపిలో చేరుతున్నారన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో తెలంగాణ మాదిగ విద్యార్థి జెఎసి ఛైర్మన్ గద్దల అంజిబాబు నేతృత్వంలో తదితరులు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని అనేక వర్గాల ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నా వారి ఆశలు అడియాశలే అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దళిత అదాలత్, రైతు పోరు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. టిఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపియేనని ఆయన పునరుద్ఘాటించారు. కెసిఆర్ దళితులకు అన్యాయం చేశారని, బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, చింతాసాంబమూర్తి, ఉపాధ్యక్షులు కాసంవెంకటేశ్వర్లు, వై.గీత, కార్యదర్శులు పాపారావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు సత్య నారాయణరెడ్డి,నల్లగొండ జిల్లా అధ్యక్షులు నూకల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేపు ఏఐటియుసి కలెక్టరేట్ల ముట్టడి

మన తెలంగాణ/హైదరాబాద్ : కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న 'కలెక్టరేట్ల ముట్టడి' నిర్వహించనున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్‌లు ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని కొనసాగించడాన్ని రద్దుచేసి పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.18 వేలు అందరికి చెల్లించాలని, కనీస వేతనాల జి.ఓ.ను సవరించాలని వారు కోరారు. ఇయస్‌ఐ, పిఎఫ్ బోనస్, పండుగ ఆర్జిత సెలవులు చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. హమాలీ, ఆటో, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డును తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పాలకులు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారస్తులకు, కార్పోరేట్లకు మేలు చేస్తూ, కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తున్నారని వారు విమర్శించారు.

ఆధార్, భూసార ఫలితాల కార్డులుంటేనే
ఎరువుల పంపిణీ

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాసిన కేంద్ర వ్యవసాయ శాఖ
- రైతులను, రిటైల్ ఎరువుల దుకాణ దారులను సన్నద్ధం చేయాలని ఆదేశాలు
- యుద్ధ ప్రాతిపదికన రైతుల ఆధార్, సర్వే నెంబర్ భూసార వెబ్‌సైట్‌లో నమోదు



మన తెలంగాణ/హైదరాబాద్ : భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే త్వరలో ఎరువుల పంపిణీ ఉండనుందని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. రిటైల్ ఎరువుల దుకాణదారులు ఇకపైన ఆధార్, భూసార ఫలితాల కార్డు ఆధారంగానే ఎరువులు విక్రయించేలా చూడాలని స్పష్టం చేసింది. రైతు ల్లో విస్తృతమైన అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర వ్యవసాయ శాఖ లేఖ రాసింది. భూసార కార్డులను అనుసంధానిత ఎరువుల నిర్వహణ వ్యవస్థకు (ఐ–ఎఫ్‌ఎమ్‌ఎస్) జత చేసేందుకు భూసార వెబ్‌సైట్‌లో రైతుల ఆధార్ నెంబర్, సర్వే నెంబర్లను నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొంది. అయితే దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 4 శాతం రైతుల వివరాలు మాత్రమే నమోదు అయ్యాయని, తెలంగాణలో చాలా తక్కువ మంది వివరాలు వచ్చాయని యుద్ధప్రాతిపదికన రైతుల ఆధార్, సర్వే నెంబర్ వివరాలను వెబ్‌సైట్‌లో నమో దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. దేశవ్యాప్తంగా మొదటి దశలో 10 కోట్ల పైన రైతులు భూసార కార్డులను పొందారని, తెలంగాణ రాష్ట్రం మొదటి దశలో ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొంది. ఎరువులు, ఖనిజ లవణాల వాడకాన్ని నియంత్రించే దిశగా దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్‌లను అందించే లక్ష్యం తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ పథకం అమలుకు అవసరమైన నిధులను పూర్తిగా కేంద్రమే అందిస్తోంది.

అయితే రాష్ట్రంలో మాత్రం చాలా మంది రైతులకు భూసార కార్డులపై అవగాహనే లేదు. కొద్ది మంది రైతులకు వాటిలోని వివరాలు అర్థంకాకపోవడం, ఏ రకంగా వినియోగించాలో తెలియదు. ప్రస్తుతం క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించి ఫలితాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ఇటీవల వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతు సర్వే, రైతు సమన్వయ సమితులు, పెట్టుబడి పథకం వంటి వాటితో విపరీతమైన పని ఒత్తిడి పెరిగి, మట్టి నమూనాల సేకరణ నెమ్మదించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 12, వ్యవసాయ మార్కెటింగ్‌ల్లో 28, సంచార భూసార కేంద్రాలు 4, మిని భూసార పరీక్షా కేంద్రాలు 2050 ఉన్నాయి. మన రాష్ట్రంలో మొదటి దశలో 2015–16లో 5 లక్షల మట్టి నమూనాలు పరీక్షించి 25.20 లక్షల కార్డులు, 2016 –17లో 5.35 లక్షల మట్టి నమూనాలు పరిక్షించి 30.33 లక్షల కార్డులు పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రెండో దశలో 2017–18, 2018 –19లో 9.73 లక్షల మట్టి నమూనాలు పరిక్షించి, 55. 45 లక్షల భూసార కార్డుల్ని పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటివరకు 4.87 లక్షలు పరీక్షించి 79,773 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిసింది.

అనుబంధ శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు తదితరాలన్నీ సమర్థవంతంగా జరిగేలా, వివిధ శాఖల మధ్య మెరుగైన సమన్వయం కుదిరేలా ఇకపైన అనుబంధ శాఖలన్నింటికీ కలిపి ఒకేసారి సమీక్ష జరిపే నూతన విధానంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమీక్ష జరపాలనుకుంటే కేవలం ఆ శాఖ కార్యదర్శితో మాత్రమే కాకుండా అనుబంధంగా ఉండే పశు సంవర్ధక, సహకార, మార్కెటింగ్, మత్స్య, ఉద్యానవన, సెరికల్చర్... ఇలా పలు విభాగాల కార్యదర్శులందరినీ భాగస్వాములను చేయాలని భావిస్తో,ది. నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కె జోషి సైతం ఈ నూతన విధానంపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. కొన్ని సంక్షేమ పథకాలు ఒకటికంటే ఎక్కువ శాఖలతో ముడిపడి ఉంటున్నందువల్ల ఆ పథకానికి సంబంధించిన సమీక్ష సమయంలో ఆ శాఖల అధికారులను కూడా భాగస్వాములను చేయాలని భావిస్తున్నారు. రెవిన్యూ ఆదాయానికి సంబంధించిన అంశంపై సమీక్ష జరపాలనుకుంటే వాణిజ్యపన్నులు, రెవిన్యూ, ఎక్సయిజ్ తదితర విభాగాల అధికారుల్ని, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మహిళా శిశు తదితర విభాగాల అధికారుల్ని భాగస్వాముల్ని చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇలా అనుబంధ విభాగాలన్నింటినీ ఒకే సమావేశానికి ఆహ్వానించి చర్చించడం ద్వారా అమలుపై స్పష్టమైన విధానాలను వివరించవచ్చునని ఓ అధికారి వ్యాఖ్యానించారు. పథకాలను సమర్థ వం తంగా అమలుచేసి ప్రభుత్వం ఆశిస్తున్న ఫలితాలను రాబట్టకోడానికి ఈ విధానంతో ఉపయుక్తంగా ఉంటుందని, ప్రధాన కార్యదర్శి సైతం దీనికి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. సాగునీటి ప్రాజెక్టులతో పాటు డబుల్ ఇళ్ళు, హరిత హారం...ఇలా అన్నింటికీ ఈ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల మార్కులు

- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ

మనతెలంగాణ/హైదరాబాద్ : పాఠశాల విద్యార్థుల ప్రతిభ ఆన్‌లైన్‌లో కనబడనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఎ), ఫార్మేటివ్ అసెస్‌మెంట్ మార్కులు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోని పాఠశాలల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏటా సర్వశిక్షా అభియాన్ అధికారులు పాఠశాలల వారీగా విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తాజాగా విద్యార్థులు వివరాలకు మార్కులను జోడిస్తున్నారు. ఒకసారి ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడానికి అవకాశం ఉండదు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల మార్కులు అందుబాటులో ఉండటం వల్ల తరగతికి తరగతికీ విద్యార్థుల ప్రతిభలో చోటు చేసుకునే మార్పులు సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

సర్వేలో పాల్గొంటేనే నిధులు

- ఎఐఎస్‌హెచ్‌ఇ ధృవీకరణ తప్పనిసరి
- వివరాల నమోదుకు వర్శిటీలకు మార్చి 4 వరకు గడువు

మనతెలంగాణ/హైదరాబాద్: యూనివర్సిటీలకు నిధులు ఇచ్చేందుకు, 'న్యాక్' గుర్తింపుకు, రూసా నిధులకు, జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌లకు అఖిల భారత ఉన్నత విద్యా సర్వే(ఎఐఎస్‌హెచ్‌ఇ) ధృవీకరణను కేంద్రం తప్పనిసరి చేసింది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఎఐఎస్‌హెచ్‌ఇ సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నర్సింగ్, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలు కూడా సర్వేలో పాల్గొనవచ్చు. వర్సిటీలకు ఇస్తున్న నిధులను కేంద్రం ఆన్‌లైన్‌లో పరిశీలిస్తుంది. ఇందుకోసం అన్ని వర్సిటీలు తప్పనిసరిగా పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంలో నమోదు కావాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో విద్యాసంస్థల వివరాలు : దేశవ్యాప్తంగా అఖి ల భారత ఉన్నత విద్యా సర్వేలో పాల్గొనే వర్సిటీలు, కళాశాలలు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, అధ్యాపకుల వివరాలతోపాటు మౌలిక సదుపాయాలు తదితర వివరాలన్నీ ఎఐఎస్‌హెచ్‌ఇ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత మళ్లీ వాటిని మార్చడానికి అవకాశం ఉండదు. ఈ సర్వే గణాంకాలు (డాటా) వర్సిటీలు, కళాశాలల్లో తనిఖీలు నిర్వహించే అధికారులకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. తనిఖీల సమయంలో ఈ డాటా వివరాలను వాస్తవ పరిస్థితుల్లో ఏ మేరకు ప్రతిబింబిస్తున్నాయో తేల్చడానికి ఉపయోగపడుతుంది. వర్సిటీలు, కళాశాలలు స్వచ్ఛందంగా ఈ వివరాలు ఇవ్వాల్సి ఉన్నా సరైన సదుపాయాలు, అధ్యాపకులు లేని కళాశాలలు సర్వేలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరచడం లేదు. అయితే భవిష్యత్తులో ఎఐఎస్‌హెచ్‌ఇ సర్వేలో పాల్గొనడం తప్పనిసరి అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మార్చి 4 వరకు గడువు : ఎఐఎస్‌హెచ్‌ఇ సర్వేలో వర్సిటీలు, కళాశాలలు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు మార్చి 4వ తేదీ వరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్‌ఆర్‌డి) అవకాశం కల్పించింది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 శాతం వరకు కళాశాలలు ఈ సర్వేలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రజాసమస్యలపై సమరం సాగిస్తాం



- కెసిఆర్‌కు సిఎం కుర్చీలో కూర్చునే హక్కు లేదు
- సిపిఐ కార్యదర్శి చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎన్నికలకు ముందు, తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కెసిఆర్‌కు సిఎం కుర్చీలో కూర్చునే నైతిక హక్కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ పోరుబాట ఆగలేదని, ప్రజాసమస్యలపై సమరం సాగిస్తామన్నారు. లాల్, నీల్ జెండా కలిసి పోరాటాలు సాగించడం ద్వారా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా 22వ మహాసభలు మెహిదీపట్నంలోని ఎంపి గార్డెన్‌లో బుధవారం జరిగాయి. ప్రారంభోత్సవ సభకు సిపిఐ హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి ఇ.టి.నరసింహ అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బిజెపి చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. ఉద్యోగాలు, నీళ్లు, నిధులు, నియామకాలని చెప్పి గద్దెనెక్కిన కెసిఆర్ ఇప్పటివరకు కేవలం 7 వేల ఉద్యోగాలే ఇచ్చారన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవినీతిని పెంచి పోషిస్తున్నదన్నారు. కందిమళ్ల ప్రతాప్‌రెడ్డితో పాటు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్‌లు ప్రసంగించారు. ఇ.టి. నరసింహ మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజా సంక్షే మం, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, ఎల్.ఎస్.ప్రకాష్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహ, సిపిఐ నాయకు లు ఎం.నరసింహ, బి.వెంకటేష్, పి.గెల్వయ్య, రాకేష్ సింగ్ వేదికపై ఆశీనులయ్యారు.

పార్లమెంట్‌ను అవమానపర్చడమే: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని పార్లమెంట్ తలుపులు మూసి ఆమోదించారని ప్రధాని మోడీ వ్యాఖ్యానించడం పార్లమెంట్‌ను అవమాన పరచడమేనని చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోడీ తన వ్యాఖ్యాలను ఉపసంహరిచుకోవాలని డిమాండ్ చేశారు.



మోడీది చౌకబారు ప్రసంగం : రేవంత్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: పార్లమెంటులో ప్రధాని మోడీ మాట్లాడిన తీరు చౌకబారు ప్రసంగాన్ని తలపించిందని, ఊళ్లో రచ్చబండ దగ్గర మాట్లాడినట్లు ఉందని కాంగ్రెస్ నాయకులు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తలుపులు మూసి తెలంగాణ బిల్లును పాస్ చేశారనడం ద్వారా తెలంగాణ సమాజాన్ని మోడీ అవమానించారని, దీనికి బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో ఏ బిల్లుపై ఓటింగ్ పెట్టినా తలుపులు మూసేస్తారన్న విషయం ప్రధానికి తెలియదా? అని ప్రశ్నించారు. నీలం సంజీవ్ రెడ్డి, అంజయ్య ,పి.వి.నర్సింహారావులను కాంగ్రెస్ అవమానించిందన్న మోడీ, వారికి కాంగ్రెస్ వల్లే ఉన్నత పదవులు వచ్చాయని మరిచిపోయారన్నారు. వాస్తవానికి మోడీనే బిజెపి నాయకులు వాజ్‌పేయి, అద్వానీ, యశ్వంత్‌సిన్హా, కేంద్ర మంత్రులు సుష్మా స్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్‌లను నిత్యం అవమానిస్తున్నారని చెప్పారు. బిజెపి ఎంపిలను కట్టు బానిసలుగా చూస్తున్నారని ఆరోపించారు. అమరావతిని ఢిల్లీని తలదన్నేలా నిర్మిస్తామని తిరుపతి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరిచిపోయి తిరుపతి వెంకన్న సాక్షిగా శఠగోపం పెట్టారన్నారు. విభజన చట్టంలో ఏఒక్క హామీ ఎందుకు అమలు చేయలేదన్నారు.

14 నుంచి 'మైనింగ్ టుడే' సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 17 వరకు 'మైనింగ్ టుడే' అనే అంతర్జాతీయ సదస్సుకు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. గనుల శాఖాధికారుల 2018 డైరీని మంత్రి కెటిఆర్ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో 'ఫిక్కీ', మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్ , మెషినరీ, పాలసీ , ఓవర్ సీస్ థీమ్‌తో ఈ సదస్సు జరుగుతుందని, దేశ ఆర్థిక ప్రగతిలో మైనింగ్ ఒక కీలకమైన అంశమని, పవర్, సిమెంట్, ఆయిల్ , గ్యాస్ ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలను ప్రభావితం చేసే పలు అంశాలపై ఈ సదస్సులో చర్చ జరగనుందని మంత్రి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఖనిజాల అన్వేషణలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల వినియోగం, గనులకు రేటింగ్ ఇవ్వడం, గనుల పర్యవేక్షణ వంటి అధునాతన పరిజ్ఞానాల పైన వివిధ దేశాల నుంచి వచ్చే నిపుణులు చర్చిస్తారన్నారు. ఇసుక ప్రొక్యూర్‌మెంట్ విధానాల అధ్యయనంలో భాగంగా క్రష్డ్ స్టోన్ శాండ్ (రాతి ఇసుక), బీచ్ శాండ్, రివర్ సాండ్ వంటి అంశాలను ప్రత్యేకంగా చర్చిస్తారన్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికా లోని దేశ విదేశాల నుండి ప్రతినిధులు హాజరవుతారని, ఆయా దేశాలకు చెందిన మైనింగ్, అనుబంధ కంపెనీలు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు.

ప్రపంచ ఐటి కాంగ్రెస్ సదస్సు సన్నాహక సమావేశంపై సమీక్ష

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 19 నుంచి 21 వరకు మాదాపూర్ హైటెక్స్‌లోని హెచ్ఐసిసిలో జరుగనున్న ప్రపంచ ఐటి కాంగ్రెస్ సదస్సు ఏర్పాట్లపై ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సియాంట్ లిమిటెడ్ ఛైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షుడు ఆర్. చంద్రశేఖర్, టెక్ మహీంద్రా సిఈవో సిపి గుర్నానీ తదితరులతో కెటిఆర్ సమీక్ష జరిపారు. ప్రధాని నరేంద్ర మోడీని కూడా ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నామని, ఏర్పాట్లు ఘనంగా చేయాలని అధికారులకు కెటిఆర్ సూచించారు. ఇంకా ఈ సమావేశానికి శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమసింఘే, కేంద్ర ఐటి శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్‌తో పాటు కెనడా, చైనా, ఆర్మేనియా, నైజీరియా, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. అలాగే ఐటి రంగ ప్రముఖులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇప్పటి నుండే ఏర్పాట్లను ముమ్మరం చేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాజరుకానున్న అతిథులకు బస, ఇతర ఏర్పాట్ల విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అంజయ్యను ఎవరూ అవమానించలేదు: విహెచ్

మన తెలంగాణ/హైదరాబాద్: లోక్‌సభలో రాష్ట్రపతి ధన్యవాదాల తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్యకు సంబంధించి సరైన సమాచారం లేకుండా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో బుధవారం నాడు విహెచ్ మీడియాతో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ నాడు టి.అంజయ్యను అవమానించలేదని స్పష్టం చేశారు. అంజయ్య ఎస్‌సి అని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన విషయంలో నరేంద్రమోడీ మాట్లాడినవన్నీ అసత్యాలేనని, బిజెపి కూడా విభజనకు మద్దతు ఇచ్చిందన్నారు. నాడు డిమాండ్ చేసిన హామీలు నెరవేర్చడంలో బిజెపి విఫలమైందని ఆరోపించారు.


ఈటల వ్యతిరేక గళం విడ్డూరం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా సహాయపడితే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ వ్యతిరేక గళం విప్పడం విడ్డూరంగా ఉందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. ఇటీవల పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన మంత్రి రాజేందర్ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఆ అంశాలను ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ ప్రజాదరణ గురించి చర్చించే అర్హత టిఆర్ఎస్‌కు లేదన్నారు. జాతీయ రహదారుల అంశంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అడిగినదానికంటే ఎక్కువ కేటాయింపులే జరిగాయన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థత, బాధ్యత రాహిత్యంతోనే మేడారం జాతరకు జాతీయ హోదా రాలేకపోయిందన్నారు. నల్లధనం, అవినీతిని అరికట్టకపోతే నీతివంతమైన రాజకీయాలు చేయడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రైవేటు ఆస్పత్రుల ప్రయోజనాల మేరకు ఆయుష్మాన్‌భవ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని ప్రతిపక్షలు చేస్తున్న ఆరోపణలను మురళీధర్‌రావు ఖండించారు. ప్రైవేటు ఆస్పత్రులు పాకిస్తాన్‌లో లేవని, మన దేశానికి సంబంధించినవేనని, వాటికి విడుదల చేసే నిధులపై కూడా ఆడిట్ జరుగుతుందని వ్యాఖ్యానించారు. జిఎస్‌టితో పన్నులను చెల్లించేవారి సంఖ్య పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే రికార్డు

- రైల్వే స్టేషన్లలో వంద శాతం ఎల్ఇడి లైటింగ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రైల్వేవ్యవస్థలోనే స్టేషన్లలో వంద శాతం ఎల్ఇడి లైటింగ్‌ను ఏర్పాటు చేసిన మొదటి రైల్వే జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) రికార్డు సృష్టించింది. ఇంధన పొదుపులో కూడా అగ్రభాగాన నిలిచింది. ఇందుకోసం కృషిచేసిన అధికారులు, సిబ్బందిని ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అభినందించారు. ఇకపైన కూడా ఇదే స్ఫూర్తిని ప్రదర్శించాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. జోన్‌లోని మొత్తం 733 రైల్వే స్టేషన్లలో ఉన్న 75681 సాంప్రదాయ లైట్ల స్థానంలో ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేశారు. ఈ ఎల్ఇడి లైట్ల ద్వారా ఏటా 32 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు రూ.2.7 కోట్ల ఖర్చు తగ్గుతుందని ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



కార్మికులను కష్టపెట్టొద్దు

- పేచీలేకుండా ముద్ర రుణాలు
- బ్యాంకర్లకు గవర్నర్ నరసింహన్ సూచన

మన తెలంగాణ/భూదాన్‌పోచంపల్లి: బ్యాంకర్లు ఎలాంటి పేచీలు లేకుండా కార్మికులందరికి మానవతా దృక్పథంతో ముద్ర రుణాలు అందించాలని గవర్నర్ నరసింహన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కుల గ్రామంలోని ది పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ చేనేత పట్టుచీరలు, వస్త్రాలను పరిశీలించి, వస్త్రాల తయారీ విధానం మార్కెంటింగ్ గురించి పార్క్ అధ్యక్షుడు కడవేరు దేవేందర్, డైరెక్టర్ భారత లవకుమార్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. చేనేత కళా వృత్తి అద్భుతమైనదని, కార్మికులకు ప్రభుత్వం ద్వారా అన్ని సహాయ సహకారాలు అందేలా ముఖ్య మంత్రి దృష్టికి తెస్తానని పేర్కొన్నారు. అలాగే మారుతున్న కాలానికి తగ్గట్టు ఆధునిక డిజైన్లతో తయారు చేసి మార్కెట్‌కు తేవాలని సూచించారు. పోచంపల్లి చేనేత పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉందని, దాని కోసం మరింత నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేయాలన్నారు. అక్కడి నుంచి పోచంపల్లి టూరిజం పార్క్ ఎస్ఆర్‌టిఆర్ఐ సందర్శించేందుకు వెళ్లారు. అక్కడ గవర్నర్‌కు మంత్రి జగదీశ్ రెడ్డి, భువనగిరి ఎంపి బూర నర్సయ్య గౌడ్, ఎంఎల్‌సి ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎంఎల్ఎ పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్, చేనేత జౌళీశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జైంట్ కలెక్టర్ రవినాయక్, ఆర్డీఓ సూరజ్ కుమార్, డిఆర్‌డిఒ వెంకట్‌రావు, ఎడి, డైరెక్టర్ భారత లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.





నా సవాల్‌కు కట్టుబడి ఉన్నా

- ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు

2019లో మాదే అధికారం: కెటిఆర్



రాజకీయ సన్యాసంలోకి కుటుంబాలను లాగడమెందుకు?

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేయడంపై తాను వ్యక్తిగతంగా సవాల్ చేస్తే, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందులోకి కుటుంబాలను లాగడం ఎందుకని మంత్రి కె.తారక రామారావు ప్రశ్నించారు. తాను చేసిన సవాల్‌కు ఉత్తమ్ ముందుకొచ్చినా, రాకున్నా తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. 2019లో అధికారం టిఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం కొద్ది మంది జర్నలిస్టులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. దద్దమ్మ ప్రభుత్వం ఉద్యోగాలివ్వడం లేదన్న ఉత్తమ్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయన ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. దేశంలో రాహుల్‌గాంధీ అంత దద్దమ్మ లేడని, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ దద్దమ్మలు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ల కంటే లోఫర్ గాళ్లు ఎవరున్నారని దుయ్యబట్టారు. మాట్లాడితే బచ్చా అంటారని, అవి అర్థం లేని కామెంట్స్ అని విమర్శించారు. నల్లగొండలో జరిగిన హత్యను రాష్ట్ర సమస్యగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య బాగున్నాయని, ఎక్కడికి వెళ్లినా తెలంగాణ విషయంలో ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఉందని అన్నారు. ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని జెఎసి చైర్మన్ కోదండరామ్ పార్టీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం బిజెపి బడ్జెట్‌లో ఎటువంటి ప్రేమ చూపిందో, అదే ప్రేమను ప్రజలు బిజెపికి సరైన సమయంలో చూపిస్తారన్నారు. రాష్ట్రానికి హక్కుగా వచ్చే నిధులు తప్ప, ఒక్క పైసా అదనంగా కేంద్ర బడ్జెట్‌లో ఇవ్వలేదన్నారు. బిజెపి నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు వారి సొంత నియోజకవర్గం అంబర్‌పేట్, ముషీరాబాద్‌లను దాటరని, కాని చాలా మాటలు మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీలు పనిచేస్తాయని, వచ్చేసారి కూడా దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీల హవా కొనసాగే అవకాశం ఉందని కెటిఆర్ జోస్యం చెప్పారు. తాను గురువారం ఢిల్లీ వెళ్తున్నానని, కేంద్ర మంత్రులను కలుస్తానని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

ముమ్మరంగా 'ధరణి' వెబ్‌సైట్ పనులు

- మంత్రులకు సర్క్యులేట్ అవుతున్న నోట్ ఫైల్

మన తెలంగాణ/హైదరాబాద్: భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం మరో సంస్కరణపై దృష్టిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి' వెబ్‌సైట్ ఆలోచన చేసింది. మంత్రివర్గ సమావేశంలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మంత్రులకు విడివిడిగా దీనికి సంబంధించిన నోట్ ఫైల్‌ను ప్రభుత్వం సర్క్యులేట్ చేస్తున్నట్లు తెలిసింది. భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వ్యవహారాలను ఇంతకాలం సబ్ రిజిస్ట్రార్‌లు చూసుకోగా ఇకపైన రెవెన్యూ అధికారులే చేసేవిధంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల చట్టాలపై ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. ఇదే సమయంలో ధరణి వెబ్‌సైట్ రూపకల్పనపై కూడా దృష్టిసారించింది. మార్చి నెల 11న పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేయనున్నందున ఆ మరుసటి రోజు నుంచి జరిగే భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితరాలన్నీ ఆన్‌లైన్ ద్వారా 'ధరణి' వెబ్‌సైట్‌లోనే అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అప్పటికల్లా రెవిన్యూ అధికారులకు శిక్షణ, ప్రాక్టికల్స్ కూడా పూర్తవుతాయి. ఈ వెబ్‌సైట్‌కు సంబంధించిన డిజైన్, ఫార్మాట్, నిరంతరం జరిగే మార్పులు చేర్పులన్నీ టిఎస్‌టిఎస్ (రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్) నిపుణులు చూసుకుంటారు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత పక్కాగా ఉన్న వివరాలన్నీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడినుంచైనా వివరాలను తెలుసుకునేలాగ, తగిన మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవడం, ఇలా భూములకు సంబంధించిన అన్ని అవసరాలనూ ఈ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. ఈ వెబ్‌సైట్‌లో రాష్ట్రంలోని అన్ని భూముల వివరాలు సమగ్రంగా ఉంటాయి. మంత్రులందరి నుంచి నోట్‌ఫైల్ తిరిగొచ్చిన తర్వాత ప్రభుత్వం వెబ్‌సైట్‌కు సంబంధించి విధాన నిర్ణయం తీసుకుంటుంది.

ఉల్వర రిజర్వాయర్‌తో ముంపు లేదు

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు




మన తెలంగాణ/హైదరాబాద్: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్వర రిజర్వాయర్‌తో ముంపు ఉండదని ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఉల్వర రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురవుతామనే భయాందోళనలు అవసరం లేదని, ఈ రిజర్వాయర్ సామర్థ్యంపై వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దని మంత్రి స్పష్టం చేశారు. జలసౌధలో అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాప్రతినిధులతో మంత్రి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ, కేవలం 0.25 టిఎంసిలతోనే ఉల్వర రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామని, 3 టిఎంసిలు, 1 టిఎంసి కెపాసిటీతో నిర్మాణం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవంలేదని స్పష్టం చేశారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని దాసరాజుపల్లి గ్రామం ముంపుకు గురవుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని, ఈ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపుకు గురికాదని హామీ ఇచ్చారు. భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని, డిండి చీఫ్ ఇంజినీర్ సునీల్, రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితులు అంచనా వేస్తారని మంత్రి తెలిపారు. కాలువల వెడల్పు తగ్గించి, భూసేకరణ తగ్గించాలని రైతులు మంత్రికి విజ్ఞప్తి చేయగా ప్రత్యామ్నాయాలు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సముద్ర మట్టానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని ఎంఎల్ఎ బాలరాజు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి అచ్చంపేట నియోజకవర్గానికి 50 వేల ఎకరాలకు నీరు అందజేస్తున్నామని, ఈ నియోజకవర్గంలో మొత్తం ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. అతి తక్కువ ముంపుతో, రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగేలా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాజెక్టులు రీడిజైన్ చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మూడు నెలల్లో దేవాదుల పాయింట్

మన తెలంగాణ/హైదరాబాద్: ములుగు నియోజకవర్గాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. మూడు నెలల్లోగా దేవాదుల పాయింట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బుధవారం నాడు ములుగులో సాగునీటి పథకాలపై మంత్రి అజ్మీరా చందూలాల్‌తో కలిసి అధికారులతో జలసౌధలో సమీక్షించారు. లక్నవరం, రామప్ప చెరువులను గోదావరి జలాలతో నింపి ములుగులో సాగు, తాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. గొల్లగూడెం, అకినేపల్లి, మల్లారం ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన నిధులు రెండు నెలల్లో మంజూరు చేస్తామన్నారు. గోదావరి ఫ్లడ్ బ్యాంకు పనులను త్వరలోనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాకాలం నాటికి ఈ పనులు పూర్తిచేయాలని గడువు విధించారు. నాలుగు వాటర్ షెడ్లను ములుగుకు మంత్రి మంజూరు చేశారు. ఏటూరు నాగారంలో రైతు బజార్ ఏర్పాటుకు రూ.75 లక్షలు మంత్రి మంజూరు చేశారు. ఈ సమావేశంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, నీటి పారుదల విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అస్థిరపరిచే కుట్ర: కర్నె




మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రాన్ని అస్థిరపర్చే కుట్రతో కాంగ్రెస్ ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ దివాళకోరు రాజకీయాలను ప్రదర్శిస్తోందని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ తన పదేళ్ల పరిపాలనకాలంలో నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. టిఆర్ఎస్ ఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ నియామకాల ప్రస్తావన చేయడం వంద ఎలుకలను తిన్న పిల్లి కాశీకి పోయినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేవలం 24వేల ఉద్యోగ నియామకాలే జరిగాయని, అందులోనూ సింహ భాగం సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వారే ఉన్నారన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు నాడు మంత్రిగా, ఎంఎల్ఎగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. టిఆర్ఎస్ తన మూడున్నరేళ్ల కాలంలోనే 81,739 ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టిన సిఎం కెసిఆర్‌పై కాంగ్రెస్ నేతలు అవాకులు చేవాకులు పేలడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ అధికారం, పదవుల కోసమే యాత్ర చేపడుతు న్నారని కర్నె ఆరోపించారు.

కువైట్‌లో మనోళ్ల ఇబ్బందులు

మన తెలంగాణ/హైదరాబాద్: కువైట్‌లో భారత రాయబార కార్యాలయం వద్ద వేలాది ప్రవాస తెలంగాణ వాసులు పడిగాపులు కాస్తున్నా రని, వారు తిరిగివచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే సిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఆర్.సి.కుంటియా హెచ్చరించారు. గాంధీ భవన్‌లో బుధవా రం ఎన్నికల సమయంలో గల్ఫ్ కార్మికుల కోసం అనేక పథకాలను ప్రకటించిన టిఆర్ఎస్ తరువాత నాలుగేళ్ళ కాలంలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. అంతకుముందు గాంధీభవన్‌లో పిసిసి మాజీ అధ్యక్షుడు, ఎఐసిసి మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా కుంటియా నివాళులర్పించారు.

యాసంగి రుణానికి అరిగోస!

- లక్ష్యంలో సగం కూడా అందని వైనం
- రూ. 15,901 కోట్లకుగాను ఇచ్చింది రూ. 7261 కోట్లు మాత్రమే



మన తెలంగాణ/హైదరాబాద్: యాసంగి సాగు మొదలై మూడు నెలల గడస్తున్నా రైతులకు పంట రుణాలు చేతికి అందడం లేదు. ఈ యాసంగిలో రూ.15,901 కోట్లు పంట రుణాల ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, బ్యాంకులు సమర్పించిన నివేదిక ప్రకారం జనవరి 25వ తేదీ వరకు కేవలం రూ.7261 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. లక్ష్యంతో పోలిస్తే 45.66 శాతమే సగం కూడా రైతులకు అందలేదు. ఇప్పటికే కొన్ని పంటలు మార్కెట్‌కు కూడా వస్తున్నాయి. అయినా బ్యాంకులు రైతుల పట్ల కనికరించడం లేదు. సమావేశాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో ప్రభుత్వ, అధికారులు బ్యాంకులపై ఒత్తిడి తీసుకురావడం లేదు. ఫలితంగా సాగు ప్రారంభంలో పెట్టుబడి కోసం చేసిన అప్పులకు.. పంట రుణం తీసుకుని తీరుద్దామనుకుంటే బ్యాంకులు ముప్పు తిప్పలు పెడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో 15లక్షల మందికి పైగా రైతులు రుణాలు తీసుకుంటారని అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 8 లక్షల మంది రైతులకే బ్యాంకులు రుణాలిచ్చినట్లు తెలిసింది. గతేడాది పెద్ద నోట్ల రద్దుతో సరైన సమయానికి రుణం పొందలేదని, ఈసారి అన్నీ అనుకూలించినప్పటికీ బ్యాంకులు రుణాలివ్వడం లేదని వాపోతున్నారు. రైతులకు బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇప్పించడంలో వ్యవసాయ శాఖ విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల బ్యాంకులు సరైన సమయానికి రుణాన్ని రెన్యువల్ చేయకపోవడంతో రైతులు పావలా వడ్డీ(పివి), వడ్డీలేని రుణం (విఎల్ఆర్) పథకాలకు దూరమవుతున్నారు. ఫలితంగా అధికమైన బ్యాంకు వడ్డీలు కట్టేందుకు ప్రైవేట్‌లో అప్పులు చేయాల్సి వస్తోంది. విఎల్ఆర్, పివి రుణాలకు సంబంధించి బడ్జెట్ ఉత్తర్వులు (బిఆర్ఒ)లు ఇవ్వడమే తప్ప బ్యాంకులకు మాత్రం సొమ్ము ఇవ్వడం లేదు. దీని ఫలితమే రానున్న బడ్జెట్‌లో వీటి ప్రతిపాదనలు ఏకంగా రూ. ఒక వెయ్యి కోట్లకు చేరింది. ఇక వ్యవసాయ టర్మ్ లోన్స్ పంపిణీ మరీ దారుణంగా ఉంది. ఈ ఏడాది వీటి లక్ష్యం రూ. 10,714 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 1948 కోట్లు అంటే 18.19 శాతం మాత్రమే పంపిణీ చేశారు.

పంటల బీమాపై తీవ్ర ప్రభావం

బ్యాంకులు సకాలంలో పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం వాటిల్లితే బీమా పరిహారం పొందే అవకాశం రైతులు కోల్పోతున్నారు. బీమా గడువు తేదీలు ముగిసే సమయానికి బ్యాంకు రుణం రూ. 3వేల కోట్లు కూడా దాటలేదని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు. ఫలితంగా పంట నష్టపోతే ఇటు ప్రభుత్వం నుంచి పరిహారం రాక, బీమా లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. యాసంగిలో రుణం తీసుకున్న రైతుల సంఖ్య 8లక్షల వరకు ఉంటే బీమా చెల్లించిన రైతుల సంఖ్య 2 లక్షలు కూడా దాటకపోవడమే ఇందుకు ఉదాహరణ అన్నారు.

“విజయం ఎప్పుడూ సాహసంతో పని కి ఉపక్రమించే వ్యక్తికే వరిస్తుంది.
– నెహ్రూ”



వడ్డీ రేట్లు యథాతథం

సంపాదకీయం

రిజర్వుబ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) ద్వైమాస సమావేశం జరిగే ముందు ప్రతిసారీ వడ్డీరేట్లు తగ్గించాలనే డిమాండ్ వినిపిస్తూ ఉంటుంది. వడ్డీరేట్లు తగ్గించకుండా రిజర్వుబ్యాంక్ అభివృద్ధికి అడ్డుపడుతున్నదనే ఆరోపణలు కూడా గతంలో వినిపించాయి. ఈ సోమ, మంగళవారాల్లో ఎంపిసి సమావేశానికి ముందు వడ్డీరేట్లు తగ్గించాలన్న డిమాండ్ వినపడలేదు. ద్రవ్యోల్బణ రేటును అదుపులో ఉంచటానికి రిజర్వుబ్యాంక్ ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ పర్యాయం వడ్డీరేట్లు తగ్గింపు అవకాశాన్ని ఎవరూ ఊహించలేదు. అది 2017 ఆగస్టులో రెపోరేటును గతసారి 0.25శాతం తగ్గించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల పెరుగుదల, కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటు పరిమితిని మించటంవల్ల వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది. దీంతో రెపోరేటు(బ్యాంకులకు ఆర్‌బిఐ ఇచ్చే స్వల్పకాలిక రుణానికి వసూలు చేసే వడ్డీరేటు) 6శాతంగా, రివర్స్ రెపో రేటు(బ్యాంకులనుంచి ఆర్‌బిఐ తీసుకునే సొమ్ముకు చెల్లించే వడ్డీరేటు)5.75 శాతంగా కొనసాగుతుంది. ఎంపిసి తదుపరి సమావేశం ఏప్రిల్ 4,5 తేదీల్లో ఉంటుంది.

మార్చి31తో ముగిసే 2017–18 ఆర్థిక సంవత్సరంలో స్థూల విలువ వృద్ధి(జివిఎ) అంచనాను రిజర్వుబ్యాంక్ 6.7 నుంచి 6.6శాతానికి తగ్గించింది. అయితే జిఎస్‌టి అమలు స్థిరీకరణ పొందటం, బ్యాంకుల రీ కాపిటలైజేషన్, పారుబాకీల పరిష్కార చర్యల వల్ల బ్యాంకుల పెట్టుబడి రుణాలు పుంజుకోవటం, ఎగుమతులు పెరిగే అవకాశాల దృష్ట్యా, వృద్ధిరేటు 2018–19లో 7.2శాతానికి చేరుతుందని అంచనా వేసింది. కాగా ప్రభుత్వం 7 నుంచి 7.5శాతం వృద్ధిరేటును ఊహిస్తున్నది.

ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయ అర్థభాగంలో ద్రవ్యోల్బణం 4.3 నుంచి4.7 శాతం వరకు ఉంటుందని గత విధాన సమీక్షలో బ్యాంకు అంచనా వేయగా అది నవంబర్‌లో 5శాతానికి, డిసెంబర్‌లో 5.2 శాతానికి పెరిగింది. అందువల్ల ఈ చివరి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1శాతంగా ఉంటుందని, వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థభాగంలో 5.1–5.6 మధ్య స్థిరపడుతుందని, ద్వితీయార్ధభాగంలో 4.5–4.6 శాతానికి తగ్గుతుందని ఎంపిసి ఊహించింది. ధరల పెరుగుదలను 4శాతం వద్ద –2పర్సంటేజి పాయింట్లు అటు ఇటు వెసులుబాటుతో నిలబెట్టటం రిజర్వుబ్యాంక్ ప్రయత్నం.

రాష్ట్రాల్లో 7వ వేతనసంఘం సిఫారసులు అమలు, ఆయిలు ధరల పెరుగుదల, కస్టమ్స్ సుంకాల పెంపుదల, బడ్జెట్ ద్రవ్యలోటు పరిమితిని ప్రభుత్వం ఈ ఏడాది 3.2కు బదులు 3.5శాతానికి, వచ్చే ఏడాది 3శాతం బదులు 3.2శాతానికి పెంచుకోవటం ధాన్యాలకు కనీస మద్దతు ధర పెంపుదల ప్రతిపాదన – ఇవన్నీ ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతాయని భావించింది. ద్రవ్యోల్బణంపై మద్దతు ధరల ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయలేమంటూ దానివల్ల గ్రామీణ ఆదాయాలు పెరిగి కొనుగోళ్లు వృద్ధిచెందే సానుకూల అంశం కూడా ఉందని ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు.

ఆర్థిక వ్యవస్థ ఈ సంవత్సరంలో తిన్న దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. పెట్టుబడులు పెరగటం మొదలైంది. ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతున్నది. ఇది దేశంలో పెట్టుబడుల కార్యకలాపం పటిష్టం కావటానికి సహాయకారి అవుతుందని ఆర్‌బిఐ భావించింది. అయితే పెట్టుబడిపై ఐదురకాల పన్నులు పెట్టుబడులపై, పొదుపు పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని గవర్నర్ వ్యాఖ్యానించారు. అవి కంపెనీలపై కార్పొరేట్ పన్ను, లాభ(డివిడెండ్) పంపిణీ పన్ను, రూ.10 లక్షలకుపైన డివిడెంట్ ఆదాయంపై పన్ను, సెక్యూరిటీస్ లావాదేవీ పన్ను, కాపిటల్ గెయిన్స్ పన్ను. ఈక్విటీల నుంచి లభించే ఆదాయంపై లాంగ్‌టర్మ్ కాపిటల్ గెయిన్స్ టాక్స్‌ను బడ్జెట్‌లో విధించటంపై వివాదం సాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్య గమనార్హం.

ఏమైనా, ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రచారం చేసుకునేటంత ఊపులేదు. స్వదేశీ మార్కెట్ విస్తరణ కన్నా ఎఫ్‌డిఐలు, ఎగుమతులపై ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. కాబట్టి ఆర్‌బిఐ ఎంపిసి కమిటీ తమ ద్రవ్య విధానంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది.

రైతును ముంచుతున్న ఎంఇపి


చూపు

ఒక ప్రక్క వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు క్షీణిస్తుండగా, మరో ప్రక్క వాటి ధరలు ఉత్పత్తి వ్యయాని కంటె దిగువకు పడిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని మోడీ ప్రభుత్వం ఎలా నిలబెట్టుకోగలదు?మన వార్షిక వ్యవసాయ ఎగుమతుల విలువ 30 బిలియన్ డాలర్లు. ఇది లక్ష్యం కంటే చాలా దూరంలో ఉన్నట్లని ప్రభుత్వం హఠాత్తుగా గ్రహించింది. విధానాల సడలింపు ద్వారా ఆ ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు పెంచవచ్చునని కూడా ప్రభుత్వం గ్రహించింది. దేశ వ్యవసాయ ఎగుమతుల సామర్థ్యం వంద బిలియన్ డాలర్లకంటే చాలా ఎక్కువగా ఉంది. ఈ వాస్తవాన్ని నిజం చేయడానికి వ్యవసాయ సరకుల ఎగుమతులకు స్వేచ్ఛ కల్పిస్తామని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల లోక్‌సభలో 2018 –19 సాధారణ బడ్జెట్ సమర్పిస్తూ పేర్కొన్నారు.

ఇటీవల కొద్ది సంవత్సరాలుగా మన వ్యవసాయ ఎగుమతులు 43.23 బిలియన్ డాలర్లు (2013–14) నుండి 33.87 బిలియన్ డాలర్లకు 2016–17లో పడిపోయాయి. మరో ప్రక్క వ్యవసాయ రంగంలో దిగుమతులు 2013–14లో 15.03 బిలియన్ డాలర్ల నుండి 2016–17లో 25.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2017 డిసెంబర్‌లో కీలక వ్యవసాయ ఉత్పత్తులయిన తృణ ధాన్యాలు, జీడిపప్పు, తెలకపిండి, చమురు గింజలు, పళ్లు, కూరగాయల ఎగుమతుల్లో క్షీణత కనపడింది. దేశంలో మొత్తం ఎగుమతుల విలువలో వ్యవసాయ ఉత్పత్తుల వాటా కొన్నేళ్లుగా తగ్గుతూ వస్తోంది. 2013–14లో 13.79 శాతం ఉన్న వ్యవసాయ ఎగుమతుల వాటా 2016–17లో 12.26 శాతానికి తగ్గింది. 2003 నుంచి 2013 దశాబ్దంలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. అప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారీ ఎత్తున సాగేవి.

2003లో 5 బిలియన్ డాలర్లు ఉన్న ఆ ఎగుమతుల విలువ 2013 నాటికి 39 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2013లో ఆస్ట్రేలియాను పక్కకు తోసి భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశాల్లో 7వ స్థానాన్ని చేజిక్కించుకుంది. వ్యవసాయ ఎగుమతుల మార్కెట్‌లో భారత్ తన సామర్థ్యాని కంటే చాలా దిగువన ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న దానితో అంతా ఏకీభవిస్తారు. అయితే ఈ ప్రకటన చేయడానికి ప్రభుత్వం ఎంచుకున్న సమయాన్ని బట్టి వ్యవసాయ ఎగుమతుల విధానాన్ని సరళీకరించడంలో ప్రభుత్వానికి గల చిత్తశుద్ధిని శంకించవలసి వస్తోంది. దేశంలో వ్యవసాయ సంక్షోభం మున్నెన్నడూ లేని స్థాయిలో విస్తరిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యవసాయ సంక్షోభం ప్రభుత్వానికి గట్టి వ్యతిరేకతను చవిచూపిస్తుందని అధికార పార్టీ భయపడుతోంది.

గ్రామీణ గుజరాత్‌లో ఇటీవలి ఎన్నికలప్పుడు సోకిన ఎదురుగాలి అధికార బిజెపిని భయపెడుతోంది. గత నాలుగేళ్లలో అనేక సరకులకు కనీస ఎగుమతి ధర (ఎంఇపి)ను ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సరకుల్లో ఉల్లిపాయలు, గోధుమ, బియ్యం, బంగాళదుంప, వంటనూనెలు కూడా ఉన్నాయి. దేశీయంగా అవి మరింత అందుబాటులో ఉండేలా చేయడానికి వాటి ఎగుమతిని ప్రభుత్వం నిషేధించింది. ఉదాహరణకు 2017 నవంబర్‌లో మోడీ ప్రభుత్వం ఉల్లిపాయలు కనీస ఎగుమతి ధర టన్ను 850 డాలర్లుగా రెండేళ్ల తరువాత తిరిగి ప్రకటించింది. ఈ ధర దిగువన ఎగుమతులను అనుమతించరు. కేవలం రెండేళ్ల క్రితం (2015 డిసెంబర్)లో ప్రభుత్వం కనీస ఎగుమతి ధరను రద్దు చేసింది. రెండేళ్ల తర్వాత తిరిగి ప్రకటించింది. వినియోగదారుల మంత్రిత్వ శాఖతో లాబీయింగ్ ను అరికట్టడానికి ఈ చర్య తీసుకుంది.



ఉల్లిపాయ ధరలలో హెచ్చుతగ్గులు తొలగించడానికి ఇది తొలి చర్య అని నిపుణులు పేర్కొన్నారు. ఉల్లి, బంగాళదుంప, టమాటో ధరలలో హెచ్చుతగ్గులను పరిష్కరించడానికి తాజా బడ్జెట్‌లో ‘ఆపరేషన్ గ్రీన్’ పథకాన్ని జైట్లీ ప్రకటించారు. ఈ పథకానికి రూ.500 కోట్ల కేటాయింపును 2018– 19 ఆర్థిక సం॥నికి చేశారు. ఇతర సరకుల విషయంలో కూడా ఎన్‌డిఎ ప్రభుత్వ ‘కనీస ఎగుమతి ధర’ వ్యూహం అంతుబట్టకుండా ఉంది. 2014 జూన్‌లో టన్ను బంగాళ దుంప కనీస ఎగుమతి ధర (ఎంఇపి)ని రూ.450గా ప్రభుత్వం నిర్ణయించింది. దేశీయంగా మరిన్ని సరఫరాలను అందుబాటులో ఉంచడానికి ఈ చర్య తీసుకుంది. దేశీయ మార్కెట్‌లో బంగాళదుంప ధరలు విపరీతంగా పడిపోయిన తర్వాత 2015 ఫిబ్రవరిలోనే ఈ ఎంఇపి ఆంక్షను ప్రభుత్వం తొలగించింది.

ప్రస్తుతం బంగాళదుంపపై అమల్లోగల ఎంఇపిని తొలగిస్తేనే రైతులకు ఆ పంటపై కనీస గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది. అలాగే ఎగుమతి ధరలకు కూడా విలువైన విదేశీ మారకం సమకూరే అవకాశం ఉంటుంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ స్వయంగా ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. 2015 ఆగస్టులో జలంధర్ రైతులు 500 క్వింటాళ్ల బంగాళదుంపను వినియోగదారులకు ఉచితంగా పంచేశారు. క్వింటాల్ రూ.1350 –1400 ధర నుంచి రూ.200కు ఏడాది కాలంలో పడిపోవడంతో రైతులు ఆగ్రహించి అలా చేశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ బంగాళదుంప రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వెళ్లగక్కడానికి ఉత్పత్తి మొత్తాన్ని పారబోశారు. కిలో బంగాళ దుంపలు ఉత్పత్తి చేయడానికి ఎనిమిది రూపాయల దాకా ఖర్చవుతుంది. అయితే ధర జనవరి మొదట్లో కిలో రూ.1–2 మాత్రమే పలికింది. దీనితో రైతులు ఆగ్రహించి పంటను పారబోశారు. ప్రస్తుత సీజన్‌కు బంగాళ దుంప కనీస మద్దతు ధర కెజి రూ.4.87గా నిర్ణయించారు. ఇది ఉత్పత్తి వ్యయం కంటె చాలా తక్కువ ధర. 2014 జూన్‌లో మోడీ ప్రభుత్వం పాలపొడిపై 5 శాతం ఎగుమతి ప్రోత్సాహకాన్ని రద్దు చేసింది. దేశీయంగా మరింత అందుబాటులోకి వస్తే ధరలు వినియోగదారులకు తగ్గుతాయన్న దృష్టితో ఈ చర్య తీసుకుంది. 2012లో అప్పటి ప్రభుత్వం స్కిమ్డ్ పాలపొడి (ఎస్‌ఎంపి)ని విశేష కృషి అండ్ గ్రామ్ ఉద్యోగ్ యోజన కింద చేర్చింది. అందువల్ల ఎగుమతిదారులకు 5శాతం సుంకం పరపతి లభిస్తుంది. మోడీ ప్రభుత్వం ఈ సౌలభ్యాన్ని రద్దుచేయడంతో ఎగుమతిదారులకు గల ప్రోత్సాహం పోయింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఎన్‌డిఎ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పడిపోతూ, దేశీయంగా ధరలు ఉత్పత్తి వ్యయం కంటె దిగువన ఉండడంతో ఈ హామీ తీరేది ఎలా అనే సందేహం కలుగుతోంది. భారత వ్యవసాయ ఎగుమతులకు మరొక ప్రతిపాదన అడ్డువస్తోంది. వ్యవసాయ ఎగుమతులు చేసే వర్ధమాన దేశం తాను నికరంగా ఆహార పదార్థాలను దిగుమతి చేసుకుంటున్నట్లు సమర్థించుకోవాలని, అందుకు తగిన సమాచారం అందించాలని ఒక ప్రతిపాదన డబ్ల్యుటిఒ మంత్రుల స్థాయి సమావేశంలో తెర మీదకు వచ్చింది. గత డిసెంబర్‌లో బ్యూనస్ ఎయిర్స్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ ప్రతిపాదనను భారత్ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించాలని కేంద్రానికి ఉంటే అది చేపడుతున్న ‘కనీస ఎగుమతి ధర’ విధానాన్ని పునఃపరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు.

✻ నూర్ మహమ్మద్

ప్రజారోగ్యం బీమార్పణం



బి.నర్సన్
9440128169

ఫిబ్రవరి ఒకటిన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2018–19 ఆర్థిక సంవత్సరపు కేంద్రబడ్జెట్ రోజురోజుకు భిన్నవర్గాలనుంచి విమర్శల నెదుర్కొంటోంది. అన్నదాత సుఖీభవ, ఆయుష్మాన్‌భవ అంటూ పెద్దపెద్ద అక్షరాలతో బడ్జెట్‌లోని పథకాలను నెత్తికెత్తుకున్న పత్రికలు సైతం కొంత సందడి తగ్గించాయి. దేశంలోని ఆర్థిక విశ్లేషకులు పథకాల్లోని లొసుగుల్ని బయటపెట్టడం మొదలయ్యేసరికి మోడీ ప్రభుత్వానికి బాజాభజాయించే పత్రికలు కూడా పతాకాన్ని కిందికి దింపక తప్పలేదు. అనుకూల వ్యాసకర్తలు సైతం ఆకర్షణీయ, ప్రశంసాపూర్వక శీర్షికలతో రాసినా చివరి పేరాలో అనుమానాల్ని వెల్లడిస్తున్నారు.

మోడీ కేర్ అని ముద్దుపేరుతో బడ్జెట్‌లో ప్రతిపాదించిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం సామాన్య ఓటరును ముగ్గులోకి దింపే ప్రయత్నమే. తగిన కేటాయింపులు లేకుండా శాస్త్రీయ పునాది లేకుండా కొడుకు పేరు సోమలింగం అన్నట్లు పథకాన్ని ప్రకటించిన జైట్లీ కూడా భుజాలు తడుముకోవలసి వస్తోంది. ఇంకా కమిటీలు, కసరత్తులు చేపట్టవలసి ఉందని విలేకర్లను సమాధానపరుస్తున్నారు. బడ్జెట్ ప్రకారం పన్నుల వసూళ్లు, ధరల పెంపుదల ఏప్రిల్ 1 నుండి పౌరులపై సవారీ చేయబోతుండగా ఆయుష్మాన్‌కు మాత్రం ఇంకా ఊపిరి పోయలేదు. 40% ఖర్చును భరిస్తూ పథకాన్ని అమలు చేయవలసిన రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఒప్పించాలి. ప్రస్తు తం రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సొంత ఆరోగ్య పథకాలు కొన్ని చోట్ల ఉన్నాయి. తెలంగాణలో ఆరోగ్య శ్రీ, ఆంధ్రప్రదేశ్ లో ఎన్‌టిఆర్ వైద్యసేవ పక్కనపెట్టి మోడీపేరిట ఈ పథకాన్ని ప్రజల కందించి రాష్ట్రా లు తమ ఓట్లను బిజెపి డబ్బాలో వేయిస్తాయా తేలాలి. జిఎస్‌టి అమలు ద్వారా దేశంలో పన్ను రూపేణా వచ్చే ఆదాయాన్నంతా గుప్పిట్లో పెట్టుకొని వివిధ పథకాలతో బిజెపి ప్రభుత్వం పౌరులందరికీ వలవిసురుతోంది. ప్రాంతీయ పార్టీల ప్రాభవానికి ఈ చర్య ప్రాణాంతకమవుతుంది.

220	192/J/అ	లావుని పట్టా	మెట్ట	0.03½	గడసు లక్ష్మమ్మ తండ్రి పోచయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి	8	-	-	-
221	192/J/ఆ	లావుని పట్టా	మెట్ట	0.03	గడసు విజయ్‌కుమార్ తండ్రి బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి		-	-	-
222	192/J/ఇ	లావుని పట్టా	మెట్ట		గడసు విష్ణువర్ధన్ తండ్రి బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి		-	-	-
223	192/J/ఈ	లావుని పట్టా	మెట్ట	0.03½	గడసు పుల్లయ్య తండ్రి పోచయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి		-	-	-
224	192/K	లావుని పట్టా	మెట్ట	0.11	గడసు లక్ష్మయ్య తండ్రి పోచయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి	4	-	-	-
225	192/L	లావుని పట్టా	మెట్ట	0.05	గడసు విజయ్‌కుమార్ తండ్రి బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి	4	-	-	-
226	192/L	లావుని పట్టా	మెట్ట	0.05	గడసు విష్ణువర్ధన్ తండ్రి బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి, మర్రి	4	-	-	-
227	192/M	లావుని పట్టా	మెట్ట	0.11	గడసు పుల్లయ్య తండ్రి పోచయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి	4	-	-	-
228	192/G	లావుని పట్టా	మెట్ట	0.30	మేడిబాయి అబ్బయ్య తండ్రి అచ్చయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి	2	-	-	-
229	192/E	లావుని పట్టా	మెట్ట	0.15	మేడిబాయి పెంటయ్య తండ్రి అబ్బయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి	2	-	-	-
230	192/E1	లావుని పట్టా	మెట్ట	0.15	మేడిబాయి గౌరయ్య తండ్రి అబ్బయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	తాటి	2	-	-	-
231	192/H	లావుని పట్టా	మెట్ట	0.30	ఎర్ర బుగ్గయ్య తండ్రి బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	4	-	-	-
232	192/F	లావుని పట్టా	మెట్ట	0.30	చెరుకూరి యాదమ్మ భర్త బాలయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	3	-	-	-

(మిగతా 7వ పేజీలో)



అనైక్యత వల్లే బిసిల వెనుకబాటు : ఆర్.కృష్ణయ్య

మన తెలంగాణ /మంథని : బిసి వర్గాల్లో ఉన్న అనైక్యత వల్లే బిసిలు వెనుకబాటుతనంలోనే ఉండిపోతున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బుధవారం మంథనిలోని శ్రీలక్ష్మీ భారతి గార్డెన్‌లో నిర్వహించిన బిసి చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై బిసిల ఐక్యత, హక్కుల సాధన తదితర అంశాలపై ప్రసంగించారు. ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం వర్గాల్లో అనేక ఉప కులాలు ఉన్నప్పటికి వారు తమ కులం ఏదీ అంటే తమ వర్గాన్ని చెప్పుకుంటారని, కాని బిసిలు మాత్రం మాది గౌడ, కాపు, రజక, నాయీ బ్రాహ్మణ అని ఇలా చెప్పుకొంటున్నారన్నారు. బిసిలు ఇలా తమ ఉప కులాలను చెప్పుకోవడం పక్కన పెడితేనే బాగుపడుతామని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఉన్న రాజకీయ పార్టీలు అన్ని అద్దె ఇండ్ల లాంటివని, బిసి సంక్షేమ సంఘం మాత్రమే బిసిలకు సొంత ఇల్లు లాంటిదన్నారు. బిసిలు ఏ రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసిన, పార్టీలను పక్కన పెట్టి బిసి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. తమ తమ గ్రామాల్లో బిసిలకు ఏ కష్టం, సమస్య వచ్చిన అందరు ఐక్యమత్యంగా ముందుకు సాగాలన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, బిసిలకు 90 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నామన్నారు.

అన్నను నరికి చంపిన తమ్ముడు

మన తెలంగాణ/మల్యాల: భూ తగాదాల నేపథ్యంలో సొంత అన్నను తమ్ముడు గొడ్డలితో నరికి చంపిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన దేశవేని భూమయ్య తన వృత్తిలో భాగంగా స్థానిక మార్కెట్‌లో చేపలు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. బుధవారం మార్కెట్‌లో చేపలు విక్రయిస్తుండగా అతడి తమ్ముడు లక్ష్మ ణ్ భూమయ్య వెనకవైపు నుంచి వచ్చి గొడ్డలితో ఒక్కసారిగా దాడి చేశాడు. దాంతో తీవ్ర గాయాల పాలైన భూమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భూమయ్య మృతి చెందాడని నిర్ధారించుకున్న లక్ష్మ ణ్ అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే మల్యాల సిఐ నాగేందర్‌గౌడ్, సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. భూ తగాదా నేపథ్యంలోనే భూమయ్య హత్యకు గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ వివరించారు.

మెడికల్ సర్టిఫికెట్ల దందా!

• గాంధీలో రాజ్యమేలుతోన్న దళారీ వ్యవస్థ • డబ్బులిస్తే క్షణాల్లో ఫిజికల్, మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలోని గాంధీ ఆసుపత్రి కొందరు వైద్యుల అక్రమ సంపాదనకు నిలయంగా మారుతోంది. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే అభ్యర్థులు శారీరకంగా దృఢంగా ఉన్నారా? ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉనాయా? లేదా? అని తెలుసుకోడానికి మెడికల్ సర్టిఫికెట్లు అవసరం. ఉద్యోగం వచ్చిన అభ్యర్థి పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి జారీ చేయబడిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుంది. అలాగే ఇంతకు ముందు ఉద్యోగంలో ఉండి అనారోగ్య కారణాలతో విధులకు కొన్ని రోజులు హాజరు కానప్పుడు కూడా మెడికల్ సర్టిఫికెట్‌ను సంస్థలకు ఇవ్వాల్సి ఉంటోంది. ఈ సర్టిఫికెట్లు తీసుకురాకపోతే ఉద్యోగాలు కూడా పొందలేరు. ఇలా ఉద్యోగుల అవసరాలను ఆసరా చేసుకొని గాంధీ ఆసుపత్రిలోని కొందరు వైద్య సిబ్బంది దళారులతో చేతులు కలిపి అక్రమ సంపాదనకు తెరలేపుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. మెడికల్, ఫిజినెస్ సర్టిఫికెట్ల దందా చాలా రోజులుగా సాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు దళారుల సాయంతో అప్పటికప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తూ అడ్డగోలుగా డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఇందుకోసం ఆసుపత్రిలో ఏకంగా పదుల సంఖ్యలో ఏజెంట్లను నియమించుకున్నట్టు సమాచారం. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులే డబ్బుల కోసం జలగల్లా సామాన్యుల రక్తాన్ని తాగుతుండటం ఆందోళన కల్గిస్తోంది. అసలు డ్యూటీని పక్కనబెట్టి అదే పనిగా సంతకాల మీద సంతకాలు పెడుతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి. అలాగే అనారోగ్యం పాలై విధులకు హాజరుకానీ ఉద్యోగులు తిరిగి ఉద్యోగంలోకి చేరేటప్పుడు సిక్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలి. ఇదే అవకాశంగా తీసుకున్న గాంధీ వైద్యులు డబ్బులు తీసుకొని అభ్యర్థులు అడిగిన వెంటనే వారికి అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారు. అయితే, వైద్యులు నియమించుకున్న దళారీ వ్యవస్థ ద్వారా వెళితే పని తొందరగా అవుతోంది. ఉదయం 7 గంటల నుంచే ఈ దందా నడుస్తోంది. దాదాపు 10 మంది ఏజెంట్లతో కొనసాగుతున్న ఈ దందాకు పలువురు సివిల్ అసిస్టెంట్ వైద్యులు, సివిల్ సర్జన్ వైద్యులు, ఫిజికల్ ఫిట్‌నెస్ వైద్యులు, నర్సు లు, ల్యాబ్ టెక్నీషియన్లతో సంబంధాలు ఉండటం గమనార్హం. ఈ సర్టిఫికెట్లు ఇవ్వడానికి సుమారు రూ. 1000 నుంచి 4000 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



కాజీపేటలో రైల్వే వ్యాగన్ ఓవారిలింగ్ యూనిట్



- ఉప ముఖ్యమంత్రి కడియం
- పది రోజుల్లో భూసేకరణ పూర్తికి ఆదేశం

మన తెలంగాణ/వరంగల్: వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలో రూ.318 కోట్ల వ్యయంతో రైల్వే వ్యాగన్ ఓవారిలింగ్ యూనిట్‌ను నిర్మాణం జరగనున్నదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా కలెక్టర్ అమ్రపాలి, రైల్వే అధికారులతో వ్యాగన్ ఫ్యాక్టరీ ఓవారిలింగ్ యూనిట్ భూసేకరణపై కడియం శ్రీహరి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేట సమీపంలోని అయోధ్యపురంలో 160 ఎకరాల దేవాదాయ శాఖకు సంబంధించిన భూములలో రైల్వే ఓవారిలింగ్ యూనిట్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిర్మాణాన్ని చేపట్టడానికి పది రోజుల్లో భూ సేకరణకు సంబంధించి పూర్తి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ అమ్రపాలి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వ్యాగన్ ఓవారిలింగ్ యూనిట్ పూర్తయితే 2వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కాజీపేట జంక్షన్ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన 160 ఎకరాల భూమిలో కొంత మంది నిరుపేదలు అనధికారికంగా ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని కడియం తెలిపారు. రెవెన్యూ అధికారులు, స్థానిక శాసనసభ్యులు క్షేత్రస్థాయిలో సంబంధిత వారితో మాట్లాడి కలెక్టర్‌తో చర్చించి వెంటనే ప్రతిపాదనలను పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రైల్వే గ్రూప్ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ మిశ్రా, కలెక్టర్ అమ్రపాలి, జెసి దయానంద్, అధికారులు పాల్గొన్నారు.



రూ.30లక్షల గంజాయి పట్టివేత

మన తెలంగాణ/ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మీదుగా కోట్ల రూపాయల విలువైన గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రెండు వాహనాల్లో సుమారు 20 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా అధికారులు పట్టుకుని వాహనాలను సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ఒరిస్సా, చత్తీస్‌గఢ్ అడవుల్లో వేల ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం. బుధవారం పట్టుబడిన గంజాయి విలువ రూ.30లక్షల వరకు ఉంటుందని అధికారుల అంచనా. ఈ మేరకు పోలీసులు గంజాయిని తరలిస్తున్న కొందరితోపాటు లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11మంది వడ్డీ వ్యాపారుల అరెస్ట్

మన తెలంగాణ/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాను నేర రహిత జిల్లాగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 11మంది అక్రమ వడ్డీ వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి విశ్వజిత్ బుధవారం రాత్రి వెల్లడించారు. డిపిఒలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ప్రాంతంలో ఆర్థికంగా బలహీనవర్గాల ప్రజలు చాలామంది ఉన్నారని, వారి అవసరాల కోసం రూ. 5, రూ.10ల వడ్డీకి డబ్బులు తీసుకోని తిరిగి కట్టలేక మద్యానికి బానిసలవుతున్నారని, చివరికి ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నారని వెల్లడించారు. పేద వారి అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీ వ్యాపారులు అధిక మొత్తాలకు వడ్డీలు తీసుకుంటూ అప్పులిస్తున్నారని ఎలాంటి రిజిస్ట్రేషన్ కానీ, లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.5,94,130తో పాటు దస్తావేజులు, బ్లాంక్ చెక్కు లు, బ్లాంక్ ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మన తెలంగాణ/మాడ్గుల: రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి బోరు మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గుర్రై గ్రామానికి చెందిన పులి లక్ష్మ య్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బుధవారం పిసిసి సభ్యులు బట్టి కిషన్‌రెడ్డి ఎంపిటిసి యాదయ్య మండల ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాశ్ రెడ్డిలు పరామర్శించారు. విషయం తెలుసున్న కల్వకుర్తి ఎంఎల్‌ఎ వంశీ చంద్‌రెడ్డి ఆస్పత్రిలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

సర్కార్ దవాఖానాల్లో మెరుగైన వైద్యం

- 10వేల పోస్టుల భర్తీకి చర్యలు
- వైద్యారోగ్య శాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి




మన తెలంగాణ/మెదక్: ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని, అందుకు సిఎం కెసిఆర్ ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వంద పడకల మాత శిశు సంరక్షణ ఆసుపత్రిని శంకుస్థాపనతో పాటు డయాలసిస్, ఐసియు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం రూ.40వేల కోట్లు ఖర్చు పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ స్థాయి నుంచి మండల కేంద్రాల వరకు ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించి, ప్రతి ఒక్కరికీ కంటిచూపు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గాంధీ ఆసుపత్రిలో ఫర్టిలిటి సెంటర్ (సంతాన సాఫల్య కేంద్రం) ఏర్పాటు చేయడం జరిగిందని, దీంతో కార్పొరేటు ఆసుపత్రిలో లక్షలు ఖర్చుపెట్టే భారీ నుంచి పేదవారికి ఊరట లభించిందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమేనని, 10వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక పరికరాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల ఏర్పాటు జరిగిందని, గాంధీ, నిజామాబాద్ ఆసుపత్రులలో అడ్మినిస్ట్రేన్ల కోసం కేంద్ర ప్రభుత్వం మూడు సీట్లను మంజూరి చేసిందని చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలన పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉందని, ఎలాంటి అవసరమొచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందిస్తున్నారని మంత్రి అన్నారు. అనంతరం మెదక్ మండలంలోని మాచవరం గ్రామంలో సబ్సిడీ గ్యాస్, గొర్రెల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసి పలువురి లబ్ధిదారులకు గ్యాస్, సబ్సిడీ గొర్రెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ మాణిక్కరాజ్‌కణ్ణన్, రాష్ట్ర వైద్యారోగ్య మౌళిక వసతుల చైర్మన్ కృష్ణమూర్తి, జడ్‌పి చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్, జెసి నగేష్, సర్పంచ్ సాంబశివరావు తదితరులున్నారు.

జూపల్లి లెక్కల సారు..!

- కొల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మంత్రి

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని రాణిఇందిరాదేవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించి పదో తరగతి విద్యార్థులకు గణితం భోదించారు. ఆ తరువాత కొంతమంది విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో భోదన చేయాలని ప్రధానోపాధ్యాయులు భూపాల్‌రెడ్డికి సూచించారు. అంతకుముందు పాఠశాలను పరిశీలించి రూ.3కోట్లతో డిస్‌మెంటల్ చేసి ఆడిటోరియం కట్టించి, నూతన పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాగా, మంత్రి జూపల్లి ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించడం విశేషం.

\- మన తెలంగాణ/కొల్లాపూర్



పేట వ్యవసాయ మార్కెట్‌లో ఈనామ్ విధానం భేష్

మన తెలంగాణ/సూర్యాపేట: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో అవలంబిస్తున్న ఈనామ్ విధానం వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందని పంజాబ్ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ విశ్వజిత్ అన్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం పంజాబ్ రాష్ట్రానికి చెందిన మార్కెటింగ్ శాఖ అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్‌లో అమలు చేస్తున్న జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం (ఈ నామ్)ను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వి.యల్లయ్య పంజాబ్ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు వివరించారు. అనంతరం మార్కెట్ యార్డులను, తేమ శాతం తెలిపే విధానాన్ని అధికారులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నామ్ విధానాన్ని పంజాబ్ రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్లలో ప్రవేశపెడుతున్నామని, దానిలో భాగంగా ఈ విధానాన్ని పరిశీలించడానికి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌ను ఎంపిక చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ రాష్ట్ర బృందం పీఏసీ జాయింట్ డైరెక్టర్ దల్‌వీందర్‌జిత్‌సింగ్, డిప్యూటి జనరల్ మేనేజర్ కులదీప్‌సింగ్, సూర్యాపేట జిల్లా మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మ ణుడు, సూపర్‌వైజర్లు అల్తాఫ్, ఖాసీం, ఎం.శ్రీనివాస్, వెంకన్న, సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌సిల నిధులు దారి మళ్లింపు

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ
- 9న దళిత సంఘాలతో భేటీ

మన తెలంగాణ/ముషీరాబాద్: ఎస్‌సిలకు కేటాయించిన రూ.50 వేల కోట్ల నిధులను ప్రభుత్వం దారి మళ్లించి ఇతర పథకాలకు వాడిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టిఎస్) రాష్ట్ర కమిటీ ఆరోపించింది. మాట్లాడితే దళితులంటే ప్రేమ ఉందనే సిఎం కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులను ఎక్కడ, ఎందుకు ఖర్చు పెట్టారనే దానిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్ విద్యానగర్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాదిగ మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) నూతన కమిటీ ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి నిధులు కేటాయించినా, అవి వారికి అందడం లేదన్నారు. ఆ నిధుల గురించి ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి కూడా అవగాహన లేదని విమర్శించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు కేటాయించిన నిధులు దారి మళ్లడంపై ఈ నెల 9న అన్ని దళిత సంఘాలతో భేటీ అవుతున్నామని, అందులో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్ రావు మాదిగ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర కమిటీ (ఎంఎంఎస్), జాతీయ, రాష్ట్ర కమిటీని ప్రకటించారు. జాతీయ అధ్యక్షురాలిగా ఆకారపు రుక్కమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఇంజగట్టమ్మ, రాష్ట్ర అధ్యక్షురాలిగా పసులాది బాలామణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిడుగు మంజుల మాదిగ, ప్రధాన కార్యదర్శులు దుబ్బ నీరజ, మహాలక్ష్మీ, అఖిల, అధికార ప్రతినిధులు సూర్యవంశి ద్రోచణ, చిలుమల పోసాని, భాగ్యమ్మ, ఉపాధ్యక్షులుగా గడ్డం శ్రీదేవి మాదిగ, ఆండాళ్లు తదితరులను ప్రకటించారు.

లైవ్ షోకు పాతిక లక్షల డిమాండ్!



దేవిశ్రీ ప్రసాద్ కేవలం మ్యూజిక్ డైరెక్టర్ మాత్రమే కాదు. పాటలు రాస్తాడు, అవసరమైతే ఆ పాట అతనే పాడుతాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే... టాలీవుడ్‌లో మరే సంగీత దర్శకుడికి సాధ్యంకాని రీతిలో స్టేజ్ షోలు కూడా చేస్తుంటాడు. ఒకప్పుడు తను పనిచేసిన సినిమాల ఆడియో ఫంక్షన్‌లలో ఆడిపాడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవాడు. కానీ ఇప్పుడు అదే పనికి అదనంగా పారితోషికం అడుగుతున్నాడు. రామ్‌చరణ్ 'రంగస్థలం' సినిమాకు సంగీతాన్ని అందించాడు దేవిశ్రీప్రసాద్. ఈ సినిమా ఆడియోను త్వరలోనే విడుదల చేయబోతున్నారు. ఈ ఆడియో ఫంక్షన్‌లో స్టేజ్‌పై దేవిశ్రీప్రసాద్ ఆటా పాటను ఏర్పాటుచేయాలని అనుకున్నారు. కానీ ఆ పనికి పాతిక లక్షలు కావాలని డిమాండ్ చేశాడట ఈ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్. దీంతో మైత్రీ మూవీ మేకర్స్ డైలమాలో పడినట్టు తెలిసింది. ఒకప్పటిలాగా అతను ఉచితంగా స్టేజ్‌పై హంగామా చేయడం మానేశాడు. ఎందుకంటే అతనికంటూ ఇప్పుడు ఓ బ్రాండ్ ఏర్పడింది. అతనికి ఓ మ్యూజిక్ టీమ్ ఉంది. ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చే రేంజ్‌కు ఎదిగాడు. ఇలాంటి సమయంలో ఆడియో ఫంక్షన్లలో ఉచితంగా లైవ్ షో చేయలేనని 25 లక్షలు డిమాండ్ చేశాడట.

మార్చి మూడవ వారం నుంచి సెట్స్‌పైకి..


ఎన్టీఆర్

నందమూరి యువ కథానాయకుడు ఎన్టీఆర్ గత మూడేళ్లుగా బ్యాక్ టు బ్యాక్ హిట్స్‌తో దూసుకుపోతున్నాడు. 'టెంపర్' నుంచి వరుసగా హిట్స్‌ను అందుకుంటూ తనకు సెట్ అయ్యే కథలను ఎంచుకుంటూ మార్కెట్ రేంజ్‌ను పెంచుకుంటున్నాడు. చివరగా 'జై లవ కుశ'తో మంచి హిట్‌ను అందుకున్న తారక్ తన నెక్స్ట్ సినిమా కూడా అదే రేంజ్‌లో ఉండాలని ప్రయత్నిస్తున్నాడు. అతని 28వ సినిమా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కనుంది. పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా గత ఏడాది ఈ చిత్రం పూజా కార్యక్రమాలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించడానికి ఫిల్మ్‌మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రం కథలో త్రివిక్రమ్ కొన్ని మార్పులు చేశాడని తెలిసింది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి మూడవ వారం నుంచి ప్రారంభంకానుంది. దర్శకుడు త్రివిక్రమ్ ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ను పూర్తిచేసినట్లు తెలిసింది. ఈ చిత్రం పూర్తి తారాగణాన్ని, సాంకేతిక నిపుణులను అతను ఎంపికచేసుకున్నాడు. హారిక హాసిని ప్రొడక్షన్స్‌లో ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ చిత్రం పూర్తిగా త్రివిక్రమ్ కామెడీ ఎంటర్‌టైనర్ తరహాలో ఉండనుంది.

ఆది, దిల్, చెన్నకేశవ రెడ్డి, ఠాగూర్, లక్ష్మి, కృష్ణ, బన్నీ, అదుర్స్, నాయక్ వంటి సూపర్ హిట్ చిత్రాలతో స్టార్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్నారు వి.వి.వినాయక్. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని సి.కళ్యాణ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వస్తోంది. శుక్రవారం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

అతను అచ్చం చిరంజీవిలా కనిపించాడు


వి.వి.వినాయక్

❖ **సూపర్‌హిట్ కొడతాం...**

యాక్షన్, కామెడీ, బ్యూటిఫుల్ సాంగ్స్ ఉన్న పక్కా కమర్షియల్ మూవీ 'ఇంటిలిజెంట్'. ఈ సినిమాతో ఖచ్చితంగా సూపర్‌హిట్ కొడతామన్న నమ్మకంతో ఉన్నాం. తాజాగా సెన్సార్ పూర్తయింది. సెన్సార్ సభ్యులంతా సినిమా చూసి చాలా బాగుందని ప్రశంసించారు.

❖ **పాటలు మ్యూజికల్ హిట్‌గా...**

'నాయక్' సినిమా తర్వాత మళ్లీ తమన్‌తో కలిసి ఈ సినిమా చేశాను. 'ఇంటిలిజెంట్'కు తమన్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చాడు. నాలుగు పాటలు మ్యూజికల్ హిట్‌గా నిలిచాయి. అతను రీరికార్డింగ్ కూడా అద్భుతంగా చేశాడు.

❖ **డ్యాన్సులు ఇరగదీశాడు...**

సరదాగా లైఫ్‌ను ఎంజాయ్ చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పాత్రలో తేజ్ తన స్టైల్‌లో బాగా చేశాడు. కామెడీ, యాక్షన్ సీన్‌లలో అద్భుతంగా నటించాడు. కొన్ని సీన్‌లలో అయితే అచ్చం చిరంజీవిలా కనిపించాడు. తేజ్ అంతకు ముందు చేసిన చిత్రాల్లో కంటే ఈ చిత్రంలో పాటలు చాలా బాగుంటాయి. డ్యాన్సులు ఇరగదీశాడు.

❖ **ఇద్దరం మంచి ఫ్రెండ్స్...**

నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుండి నాకు నిర్మాత సి.కళ్యాణ్ తెలుసు. ఇద్దరం మంచి ఫ్రెండ్స్. ఎప్పుడు షూటింగ్ జరిగినా ఎలాంటి అవాంతరాలు లేకుండా అన్నీ సమకూర్చుతూ ఎంతో ఖర్చుపెట్టి ఆయన ఈ సినిమాను నిర్మించారు.

❖ **గాడ్‌ఫాదర్‌లాంటి వ్యక్తి కోసం...**

తనకు సాయం చేసిన గాడ్‌ఫాదర్‌లాంటి వ్యక్తికి అన్యాయం జరిగితే అతని కోసం హీరో ఎలా స్పందించాడు? విలన్‌తో ఎలా పోరాడాడు? అనేది సినిమా ప్రధాన కథాంశం. ఒక చిన్న మైండ్‌గేమ్‌ను హీరో 'ఇంటిలిజెంట్'గా ఎలా డీల్ చేశాడు అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

❖ **ఒరిజినల్‌కు ఏమాత్రం తీసిపోకుండా...**

చిరంజీవి అన్నయ్య సినిమాల్లో నాకు చాలా ఇష్టమైన పాట 'చమక్ చమక్..'. ఈ పాటను రీమిక్స్ చేయాలని అందరం అనుకున్నాం. సి.కళ్యాణ్ ఈ పాట రీమిక్స్ గురించి ఇళయరాజాను సంప్రదించగా ఆయన చాలా ఆనందంగా స్పందించి ఓకే చేశారు. ఈ పాటను రోమ్‌లోని అందమైన లొకేషన్‌లలో చిత్రీకరించాం. ఒరిజినల్ పాటకు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ పాట ఉంటుంది.

❖ **కమర్షియల్ హీరోయిన్ అవుతుంది...**

తొలిసారి పూర్తి కమర్షియల్ మూవీలో హీరోయిన్ లావణ్య త్రిపాఠి నటించింది. ఈ సినిమాతో ఆమె పెద్ద కమర్షియల్ హీరోయిన్ అవుతుంది. సంధ్య క్యారెక్టర్‌లో ఆమె చక్కగా నటించింది. డ్యాన్సులు కూడా బాగా చేసింది.

❖ **అదుర్స్-2 చేస్తాను...**

అదుర్స్ సినిమాను మించి 'అదుర్స్ 2' తీయాలని మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాం. ఇందుకోసం రెండు, మూడు కథలు అనుకున్నాం. కానీ అవి అంత బాగా అనిపించలేదు. కథ ఓకే కాగానే 'అదుర్స్2' చేస్తాను.

❖ **మహేష్‌తో సినిమా...**

మహేష్‌బాబుతో కూడా తప్పకుండా ఓ సినిమా చేస్తాను. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాను. ఇక కొత్త దర్శకులను ప్రోత్సహిస్తూ మంచి కాన్సెప్ట్ బేస్డ్ మూవీస్ తీయాలని ప్లాన్ చేస్తున్నాను. రెండు సంవత్సరాల తర్వాత ప్రొడక్షన్ హౌస్ ప్రారంభిస్తాను.

నా నిజ జీవితానికి దగ్గరగా కనిపిస్తా

వరుణ్‌తేజ్, రాశిఖన్నా హీరోహీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మితమైన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శనివారం విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక రాశిఖన్నా చెప్పిన సినిమా విశేషాలు...

అదే ఈ సినిమా కాన్సెప్ట్...

ఈ సినిమా మొత్తం 'తొలిప్రేమ' గురించే. యుక్త వయసులో ఉన్నవారిలో పుట్టిన తొలి ప్రేమ ఎలా ఉంటుంది, వయసు పెరిగిన కొద్దీ ఆ ప్రేమ ఎలా మారుతుంటుంది అనేదే ఈ సినిమా కాన్సెప్ట్.

ఎలాంటి పోలిక లేదు...

ఎనిమిది నెలల క్రితం పవన్‌కళ్యాణ్ 'తొలిప్రేమ' చిత్రాన్ని చూశాను. చాలా బాగుంది. కానీ ఆ చిత్రానికి మా 'తొలిప్రేమ'కు ఎలాంటి పోలిక లేదు. రెండూ పూర్తిగా భిన్నంగా ఉంటాయి.

అందమైన పాత్ర నాది...

సినిమాలో నా క్యారెక్టర్ పేరు వర్ష. ఇందులో నేను మూడు లుక్స్‌లో కనిపిస్తాను. అందమైన పాత్ర నాది. నా నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర చేయడం ఆనందంగా ఉంది.

వయసులో చిన్నగా కనపడేందుకు...

హీరో వరుణ్‌తేజ్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. వయసులో చిన్నగా కనబడటానికి రోజుకు మూడుసార్లు జిమ్‌కు వెళ్లేవాడు. అతను ఎంతో సరదాగా ఉంటాడు. అతని క్యారెక్టర్ ఈ సినిమాలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది.

స్క్రిప్ట్‌పై రెండేళ్లు వర్క్ చేశాడు...

దర్శకుడిగా మొదటి సినిమా అయినప్పటికీ వెంకీ అట్లూరి ఈ సినిమాను చాలా బాగా తీశాడు. ఎక్కడా పొరపాట్లు జరుగకుండా చూసుకొని ఎంతో జాగ్రత్తగా సినిమాను తీశాడు. దాదాపు రెండేళ్లు అతను ఈ స్క్రిప్ట్ మీద వర్క్ చేశాడు.


రాశి ఖనా

క్యూట్ సీన్ అది...

ఈ సినిమాలో నాకు నచ్చిన సీన్లు కొన్ని ఉన్నాయి. అన్నింటిలోకంటే కారు సీన్ బాగా నచ్చింది. ట్రైలర్‌లో కూడా ఈ సీన్ కనపడుతుంది. చాలా అందమైన, క్యూట్ సీన్ ఇది.


నందిత శ్వేత

నితిన్‌కు జోడీగా నందిత


నితిన్

హీరో నితిన్ మళ్లీ స్పీడు పెంచాడు. 'అ..ఆ' సినిమాతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ కొట్టాక అతను ఆచితూచి సినిమాలు చేయడం మొదలెట్టాడు. అయితే 'అ..ఆ' తర్వాత హను రాఘవపూడి దర్శకత్వంలో చేసిన 'లై' పూర్తిగా నిరాశపరిచింది. ప్రస్తుతం నితిన్ కొత్త దర్శకుడు కృష్ణచైతన్య రూపొందిస్తున్న చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రం ఇంకా పూర్తికాకముందే అతను మరో సినిమాకు కూడా ఓకే చెప్పేశాడు. 'శతమానం భవతి'తో మంచి హిట్ కొట్టిన సతీష్ వేగేశ్న డైరెక్షన్‌లో 'శ్రీనివాస కళ్యాణం' చిత్రం చేయబోతున్నాడు. ఇందులో నందిత శ్వేతను హీరోయిన్‌గా ఖరారు చేసినట్లు తెలిసింది. ముందుగా ఇద్దరు, ముగ్గురు హీరోయిన్లను పరిశీలించినప్పటికీ చివరకు నందితవైపు ఫిల్మ్‌మేకర్స్ మొగ్గు చూపించారట. ఇందులో నందితతో పాటు మరో హీరోయిన్ కూడా నటించనుంది. అయితే ఆ హీరోయిన్‌ను ఇంకా ఫైనలైజ్ చేయలేదు. ఈ చిత్రంలో 50 మందికి పైగా నటీనటులను తీసుకుంటున్నాడట దర్శకుడు సతీష్ వేగేశ్న. ఈ నటులతో సినిమాలో పండుగ వాతావరణం కనిపిస్తుందట.


సమంత

సమంత కోసం స్పెషల్ టీజర్

రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం..1985' చిత్రం విడుదల కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం టీజర్, పోస్టర్లు సినిమాపై అంచనాలను మరింతగా పెంచేశాయి. ఇప్పుడు మరో టీజర్ వచ్చేందుకు సిద్ధమవుతోంది. అది సమంత స్పెషల్ టీజర్ కావడం విశేషం. ఇటీవల విడుదలైన 'రంగస్థలం' టీజర్‌లో సమంత ఎక్కడా కనిపించలేదు. ఇందులో చిట్టిబాబు పాత్రలో నటించిన చరణే కనిపించాడు. చెవిటివాడైన చిట్టిబాబు ఈ టీజర్‌లో హంగామా చేశాడు. అయితే ఇప్పుడు సమంత కోసం ప్రత్యేకంగా టీజర్ రిలీజ్‌కానుంది. 20 సెకన్ల నిడివి కల ఈ టీజర్‌ను సిద్ధం చేస్తున్నాడట సుకుమార్. అతి త్వరలో ఇది విడుదలకానుంది. ఈ టీజర్‌తో సమంత ఈ చిత్రంలో ఎలాంటి పాత్ర పోషించిందో మనకు తెలిసిపోతుంది.

ఆ దర్శకుడితో మూడో సినిమా



కోలీవుడ్‌లో ప్రయోగాత్మక కమర్షియల్ సినిమాలు చేయడంలో స్టార్ హీరో సూర్య ఎప్పుడూ ముందుంటాడు. తన సినిమా కథలో ఏదైనా కొత్తదనం ఉండాలని కోరుకుంటాడు. ప్రస్తుతం దర్శకుడు కె.వి.ఆనంద్‌తో ఓ డిఫరెంట్ సినిమా చేయడానికి సూర్య ఒప్పుకున్నాడు. అయితే ఇందులో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్‌బచ్చన్ ఓ కీలక పాత్రలో నటించనున్నాడట. కథ వినగానే బిగ్‌బి వెంటనే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాడని తెలిసింది. ఇకపోతే గతంలో కె.వి.ఆనంద్‌తో సూర్య వీడొక్కడే, బ్రదర్స్ అనే సినిమాలు చేశాడు. ఇప్పుడు మూడోసారి అతనితో సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రంతో మంచి హిట్ కొట్టాలని కె.వి.ఆనంద్ కసితో ఉన్నాడు. అలాగే ఈ క్రేజీ కాంబినేషన్‌తో కలిసి మూడవసారి సంగీత దర్శకుడు హారిస్ జైరాజ్ పనిచేయబోతుండడం విశేషం. మరి ఈ ముగ్గురి కలయిక ఏమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి. లైకా ప్రొడక్షన్స్ నిర్మించబోతున్న ఈ ప్రాజెక్ట్ మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానుందట. ప్రస్తుతం సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో సాయి పల్లవి, రకుల్‌ప్రీత్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

ఏ సినిమా ఓకే కాలేదు


బాబీ

పవన్‌కళ్యాణ్‌తో చేసిన 'సర్దార్ గబ్బర్‌సింగ్' చిత్రం దర్శకుడు బాబీని పూర్తిగా నిరాశపరిచింది. ఈ చిత్రంతో అతనికి ఫ్లాప్ డైరెక్టర్ అనే ముద్ర పడిపోయింది. ఆతర్వాత ఎలాగోలా స్టార్ హీరో ఎన్టీఆర్‌ను ఒప్పించి బాబి 'జై లవ కుశ' సినిమా చేశాడు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ మూడు పాత్రలో అద్భుతంగా నటించి అదరగొట్టాడు. ఈ సినిమా ఘన విజయం సాధించినప్పటికీ బాబీకి పెద్దగా పేరు రాలేదు. సినిమా సక్సెస్ క్రెడిట్ అంతా ఎన్టీఆర్ ఖాతాలోనే పడిపోయింది. 70 కోట్లకు పైగా షేర్ వసూళ్లను సాధించిన ఈ సినిమా దర్శకుడు బాబీకి ఇప్పుడు పెద్దగా అవకాశాలు కూడా రావడం లేదు. ప్రస్తుతం అక్కినేని నాగచైతన్యను ఓ సినిమాకు ఒప్పించేందుకు అతను చక్కర్లు కొడుతున్నాడట. చైతూ నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. కాకపోతే ఈ దర్శకుడు చెప్పిన మూడు సబ్జెక్టులలో ఒకదాని గురించి మాత్రం సీరియస్‌గానే చర్చలు జరుగుతున్నాయట. ఒకవేళ ఈ చిత్రం ఓకే అయితే సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి ఆరు నెలల సమయం పడుతుందని టాక్. అయితే ఈలోపు బాబి 'ఛలో'తో మంచి హిట్ కొట్టిన నాగశౌర్యకు ఒక స్టోరీ లైన్ చెబుతున్నాడట. అది ఓకే అయితే ఆ చిత్రాన్ని ముందుగా ప్రారంభిస్తాడని సమాచారం.

క్యూ4లో కాగ్నిజెంట్‌కు స్వల్ప నష్టాలు

ముంబై : గతేడాది డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో అమెరికా ఐటీ దిగ్గజం కాగ్నిజంట్ స్వల్ప నష్టాలను నమోదు చేసింది. 2016 సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.416 మిలియన్లతో పోలిస్తే 18 మిలియన్ డాలర్ల నష్టాలను నమోదు చేసింది. అమెరికాలో పన్ను సంస్కరణలకు చెందిన వన్ టైమ్ ప్రొవిజనల్ ఆదాయ పన్ను వ్యయం నష్టాలకు కారణమైంది. క్యూ4లో ఐటి దిగ్గజం ఆదాయం 3.83 బిలియన్ డాలర్లతో 10.6 శాతం పెరగ్గా.. ఇది గతేడాదిలో 3.46 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. 2017 సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 14.81 బిలియన్ డాలర్లతో 9.8 శాతం వృద్ధిని సాధించింది. 2017 సంవత్సరంలో నికర లాభం 1.5 బిలియన్ డాలర్లుగా ఉంది. మొత్తంగా కార్పొరేట్ ఆదాయం పన్ను రేటు ప్రభావం 2018 సంవత్సరానికి సుమారు 24 శాతం ఉంటుందని, 2019 సంవత్సరంలో 24–25 శాతంగా ఉంటుందని అంచనా వేశామని ఈమేరకు కాగ్నిజంట్ వెల్లడించింది. డిజిటల్‌లోకి మారేందుకు వరుసగా పెట్టుబడులు పెట్టడంతో పాటు గతేడాదిలో ఇతర అంశాలు ప్రభావం చూపాయని కాగ్నిజంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఫ్రాన్సిస్కో డిసౌజా అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి శక్తివంతమైన టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నామని అన్నారు.

ఆటో ఎక్స్‌పో 2018లో మారుతీ సుజుకీ ఫ్యూచర్ ఎస్



న్యూఢిల్లీ: గ్రేటర్ నోయిడాలో పద్నాలుగో ఆటో ఎక్స్‌పో అట్టహాసంగా ప్రారంభమైంది. 2018 ఆటోఎక్స్‌పోది మోటార్ షో ఫిబ్రవరి 9 నుంచి 14 వరకు జరుగనుంది. ఈ సందర్భంగా ముందస్తుగా బుధవారం, గురువారం మీడియాకు, కంపెనీలకు ప్రత్యక షో నిర్వహిస్తున్నారు. పలు వాహనాలను ఇక్కడ ప్రదర్శించారు. ముఖ్యంగా మోస్ట్ ఎవైటెడ్ ఆటో ఎక్స్ పో హ్యుందాయ్, మారుతిసుజుకి, హీరో మోటోకార్ప్, అలాగే ఇటాలియన్ ఆటోమొబైల్ బ్రాండ్స్ ఏప్రిలియా, పియాజ్జియో , కంపెనీలు తమ కొత్త ఉత్పత్తులతో ఎక్స్‌పోలో హల్‌చల్ చేయనున్నాయి. మరోవైపు వోక్స్ వ్యాగన్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సహా బజాజ్ ఆటో, నిస్సాన్ ఇండియా కంపనీలు తమ సరికొత్త వాహనాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. దేశీయ మార్కెట్లో 2020 నాటికి ఒక ఎలక్ట్రిక్ వాహనంతో సహా తొమ్మిది కొత్త మోడళ్లను విడుదల చేయనున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రకటించింది. ఇటాలియన్ ఆటో దిగ్గజం పియాజ్జియో 125 సిసి బైక్‌ను ఆటో ఎక్స్‌పోలో ఆవిష్కరించింది. మార్కెట్లోకి ఏప్రిలియా ఎస్ఆర్ 125ను విడుదల చేసింది. దీనికి ధరను రూ .65,310 (ఎక్స్‌షోరూమ్ పూణే) గా నిర్ణయించింది. వీటితో పాటు వెస్పా స్కూటర్లను కూడా ప్రదర్శించింది. ఎస్ఆర్ 125 బైక్, టివిఎస్ ఎన్ టార్క్ 125, హోండా గ్రాజియా, సుజుకి యాక్సెస్‌ల సందడి చేయనున్నాయి.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34082.71	–113.23	–0.33%
నిఫ్టీ	10476.70	–21.55	–0.21%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29110	31133.69	0%
ముంబై	30010	32096.26	3.95%
ఢిల్లీ	29550	31604.28	1.2%
కోల్‌కతా	29770.99	31840.63	0%
కేరళ	28000	29946.52	1.41%
బెంగళూరు	28700	30695.19	1.23%
హైదరాబాద్	28870	30877.01	–1.3%
గల్ఫ్	1412.08	1510.25	–3.24%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	345	విశాఖపట్నం	355
వరంగల్	347	చిత్తూరు	373
విజయవాడ	350	చెన్నై	380
గోదావరి	350	బెంగళూరు	365

రెపో రేటు యథాతథం 6%



- స్వల్పకాలంలో అధిక ద్రవ్యోల్బణం అంచనా
- 2018 వృద్ధి రేటు 6.6 శాతానికి కోత
- ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ వెల్లడి

న్యూఢిల్లీ : అందరూ ఊహించినట్టుగానే ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ద్రవ్యోల్బణం భయాలతో వరుసగా మూడోసారి కూడా 6 శాతం రెపో రేటు(బ్యాంకులకు ఆర్‌బిఐ ఇచ్చే రుణాలపై వడ్డీ రేటు)నే నిర్ణయించింది. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ) రెపోరేటు యథాతథంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నాయి. కమిటీలో ఐదుగురు సభ్యులు సానుకూలంగా, ఒక్కరు వ్యతిరేకంగా ఓటు వేశారు. చమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉద్యోగాల జీతాల పెంపు వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముందని ఆర్‌బిఐ పేర్కొంది. అలాగే 2018–19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనూ ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6 శాతం వరకు ఉండే అవకాశముందని అభిప్రాయపడుతోంది. గత ఆగస్టు నెలలో మాత్రమే ఆర్‌బిఐ 0.25 శాతం మేరకు వడ్డీ రేటును తగ్గించడంతో 6 శాతానికి తగ్గింది. ఆ తర్వాత ఇప్పటివరకు వడ్డీ రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. డిసెంబర్ సమీక్షలో ధర పెరుగుదల ఆందోళనల కారణంగా ఎంపిసి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తటస్థంగానే కొనసాగించింది.

తాజాగా రివర్స్‌రెపో రేటు(వాణిజ్య బ్యాంకుల నుంచి ఆర్‌బిఐ తీసుకునే నిధులపై ఇచ్చే రేటు)ను 5.75 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధిరేటును 6.7 శాతం నుంచి 6.6 శాతానికి కత్తిరించింది. 2019 వృద్ధి రేటు 7.2 శాతంగా అంచనా వేసినట్టు ఉర్జిత్ పటేల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2018 బడ్జెట్‌లో కనీస మద్దతు ధర పెంపు అంశం ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేయనుందని ఎంపిసి వివరించింది. ఈ నిర్ణయం అమల్లోనికి వస్తే ద్రవ్యోల్బణం అధికస్థాయికి చేరే అవకాశం ఉందని అంచనాను ప్రకటించింది. దేశీయంగా జనవరిలో పెట్రోల్, డీజిల్ ధరలు వేగంగా పెరగ్గా.. అంతకుముందు అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో 2019 తొలి అర్ధభాగంలో ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6 శాతం మధ్యలో ఉండే అవకాశం ఉందని అంచనావేసింది. ద్వితీయార్థంలో 4.5 నుంచి 4.6 శాతం మధ్యలో ఉండేందుకు అవకాశం ఉందని ఆర్‌బిఐ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ నేపథ్యంలో ఎగుమతులు మరింత పెరిగేందుకు అవకాశం ఉన్నట్లు అంచనావేస్తున్నామని ఎంపిసి వెల్లడించింది. వ్యవస్థలో ఇక మీదట కూడా ద్రవ్య లభ్యత ఉండే అవకాశముందని పేర్కొంది.

ఆర్‌బిఐ సమీక్ష ముఖ్యాంశాలు

☛ ఆర్‌బిఐ వడ్డీ రేట్లు యథాతథంగా 6 శాతాన్నే కొనసాగించింది.

☛ రివర్స్ రెపో రేటు 5.75 శాతంలో ఎలాంటి మార్పు లేదు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ(ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 6.25 శాతం

☛ ద్రవ్యపరపతి విధాన సమీక్ష తటస్థ విధానాన్ని అవలంభించింది.

☛ ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ)లో వడ్డీ రేట్ల యథాతథానికి ఐదుగురు సభ్యులు అనుకూలంగా.. ఒక్కరు వ్యతిరేకంగా ఓటు వేశారు.

☛ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ప్రభావంతో జనవరిలో పెట్రోల్, డిజిల్ ధరలు వేగంగా పెరిగాయి.

☛ నాలుగో త్రైమాసికంలో (జనవరి–మార్చి) రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా అంచనా వేశారు. అలాగే 2018–19 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 5.1 శాతం నుంచి 5.6 శాతం మధ్య అంచనా

☛ 2018–19 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ద్రవ్యోల్బణం 4.5 శాతం నుంచి 4.6 శాతంగా అంచనా

☛ 2017–18 ఆర్థిక సంవత్సరానికి జివిఎ(గ్రాస్ వాల్యూ యాడెడ్) వృద్ధి 6.6 శాతంగా ఉంది.

☛ 2018–19 ఆర్థిక సంవత్సరానికి జివిఎ 7.2 శాతంగా అంచనా

☛ జిఎస్‌టి నిలకడ స్థితికి చేరింది.. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సానుకూలంగా ఉంది.

☛ పెట్టుబడుల్లో పునరుద్ధరణ సంకేతాలు కనిపిస్తున్నాయి.

☛ బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్, దివాలా చట్టం కారణంగా రుణ వృద్ధి ఊపందుకోనుందని ఆర్‌బిఐ పేర్కొంది.

☛ అంతర్జాతీయంగా డిమాండ్ మెరుగవుతుండడంతో ఎగుమతి వృద్ధి మరింతగా పెరగనుంది.

రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు

తేదీ	రెపోరేటు(శాతం)
సెప్టెంబర్, 2013	7.5శాతం
అక్టోబర్, 2013	7.75శాతం
జనవరి, 2014	8శాతం
జనవరి, 2015	7.75శాతం
మార్చి, 2015	7.5శాతం
జూన్, 2015	7.25శాతం
సెప్టెంబర్, 2015	6.75శాతం
ఏప్రిల్, 2014	6.5శాతం
అక్టోబర్, 2016	6.25శాతం
ఆగస్టు, 2017	6 శాతం
డిసెంబర్, 2017	6శాతం
ఫిబ్రవరి, 2018	6శాతం

☛ గ్రామీణ, మౌలిక సదుపాయ రంగాలపై కేంద్ర బడ్జెట్ దృష్టి పెట్టడం స్వాగతించదగిన పరిణామం.

☛ వచ్చే ద్రవ్యపరపతి విధాన సమీక్ష ఏప్రిల్ 4, 5 తేదీలలో నిర్వహించనున్నారు.

ఆర్‌బిఐ వడ్డీ రేట్లపై స్పందనలు



2019 ద్వితీయార్థంలో ద్రవ్యోల్బణంపై ఆర్‌బిఐ దృక్పథం నియంత్రణను సూచిస్తోంది. ఇది బాండ్ మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపనుంది.

— ఎస్‌బిఐ చైర్మన్ రజినీష్ కుమార్




మరింత గణాంకాల కోసం ఆర్‌బిఐ వేచిచూసే ధోరణిని అవలంభిస్తోంది. నాణ్యమైన ద్రవ్య లోటు చాలా ప్రధానమైంది. ఎంఎస్‌పి(కనీస మద్దతు ధర) లెక్కింపు, అమలు చాలా ముఖ్యం.

— ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఎస్ఎస్ ముంద్రా



ద్రవ్యోల్బణం పెరగనుందనే సంకేతాలతో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తోంది. రానున్న కాలంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు ప్రమాదాలను దూరం చేస్తుంది.

— యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ హెడ్ ఆర్.శివకుమార్



వడ్డీ రేట్ల పెంపు విషయంలో ఆర్‌బిఐ తొందరపడడం లేదు. సెంట్రల్ బ్యాంక్ వృద్ధి రేటు గురించి ఆందోళన చెందుతోంది.

— క్రిసిల్ చీఫ్ ఎకనమిస్ట్ ధర్మకీర్తి జోషి

వరుసగా ఏడో రోజూ పతనం

113 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై : స్టాక్‌మార్కెట్ సూచీలు తుఫాన్ తర్వాత ప్రశాంత వాతావరణాన్ని తలపించాయి. క్రితం రోజు బీభత్సం సృష్టించిన మార్కెట్లు బుధవారం లాభాలతో ప్రారంభమైన వాటిని నిలుపుకోలేకపోయాయి. రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడం వంటి అంశాలు ఇన్వెస్టర్లను నిరుత్సాహపర్చగా.. ద్యంతం ఒడిదుడుకుల ప్రయాణం చేసిన స్టాక్ మార్కెట్ చివరకు స్వల్ప నష్టాల్లో ముగిసింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది ఏడో రోజు.. మార్కెట్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 113 పాయింట్లు నష్టపోయి 34082.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 21.55 పాయింట్లు క్షీణించి 10,476.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ సూచీ ఇంట్రాడేలో 34,008 నుంచి 34,666 పాయింట్ల శ్రేణి మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇలో కీలక బ్యాంక్ నిఫ్టీ 141 పాయింట్లు నష్టపోయి 25,670 వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఇవాళ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 367 పాయింట్ల లాభంతో 34563 వద్ద, నిఫ్టీ 97 పాయింట్ల లాభంతో 10596 వద్ద ప్రారంభమయ్యాయి. కానీ నిలుపుకోలేకపోయాయి. ఆసియా మార్కెట్లు గరిష్టస్థాయిలను నుంచి దిగిరావడం, ఆర్‌బిఐ కీలక రేట్లపై నిర్ణయం నేపథ్యంలో ట్రేడింగ్ సమయంలో ఇన్వెస్టర్లు జాగ్రత్త వ్యవహరించారు. ఎన్‌టిపిసి, ఒఎన్‌జిసి, కోల్ ఇండియా, అరబిందో ఫార్మా, హిందూపెట్రోనెట్ షేర్లు 2నుంచి 5శాతం లాభపడ్డాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్, యస్‌బ్యాంక్, ఇన్ఫ్రాటెల్, ఇండియన్‌బుల్ హౌసింగ్‌ఫైనాన్స్, అంబుజా సిమెంట్స్ షేర్లు 2 నుంచి 3 శాతం నష్టపోయాయి.



2008 ఆర్థికమాంద్యంతో పోలిక లేదు

ప్రస్తుత పరిస్థితులు 2008 సంవత్సరంలో ఏర్పడిన ఆర్థికమాంద్యంతో పోల్చలేమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. అయితే అదే తరహా సంక్షోభం ఆరంభమయిందని అంతా భయపడుతున్న వేళ అలాంటి పరిస్థితులేమీ లేవని అభయమిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా, దేశీయంగా సూచీలు భారీ పతనావస్థలో ఉన్నాయి. దీంతో చాలామంది భయపడుతున్నారు. భారత్‌కు సంబంధించి అప్పటికి, ఇప్పటికి చాలా వ్యత్యాసం ఉందని నిపుణులు చెబుతున్నారు. 2008కి ముందు సంవత్సరంలో సూచీలు 60 శాతం లాభాల ర్యాలీ జరిపాయి. 2018కి ముందు ఏడాది సూచీలు కేవలం 28 శాతమే లాభపడ్డాయి. అప్పట్లో సంవత్సరం పిఇ 22.15 రెట్లుండగా, ఇప్పుడు ఇది 20.62 రెట్లు మాత్రమే ఉంది. అప్పుడు సంవత్సర ఇపిఎస్ వృద్ధి 19 శాతం కాగా, ఇప్పుడు కేవలం 8 శాతమే ఉంది. 2007–08లో మ్యూచువల్ ఫండ్లలోకి రూ.7వేల కోట్ల పెట్టుబడులే వచ్చాయి. ఇప్పుడు సుమారు రూ.58వేల కోట్ల రూపాయల పెట్టుబడుల వచ్చాయని నిపుణులు వ్యత్యాసాలను వివరిస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక అంశాలే దిద్దుబాటుకు కారణమని అంటున్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
హెచ్‌పిసిఎల్	408.90	382.50	396.35	377.60	18.75	4.97
అరబిందో ఫార్మా	621.50	602.80	616.10	596.85	19.25	3.23
కోల్ ఇండియా	299.70	290.35	297.60	290.35	7.25	2.50
ఒఎన్‌జిసి	191.50	187.00	190.00	185.45	4.55	2.45
టాటాపవర్	85.85	83.70	84.70	82.80	1.90	2.29
బిపిసిఎల్	481.60	468.65	476.25	467.20	9.05	1.94
గెయిల్	465.30	451.35	460.30	452.60	7.70	1.70
జీఎంటర్‌టైన్	585.95	573.25	581.15	571.75	9.40	1.64
ఐచర్ మోటార్స్	28,410.95	27,120.10	28,010.45	27,579.25	431.20	1.56
ఏసియన్ పెయింట్స్	1,125.20	1,106.55	1,121.10	1,110.25	10.85	0.98

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
అంబుజా సిమెంట్స్	257.95	246.55	248.30	255.30	7.00	2.74
భారతి ఎయిర్‌టెల్	449.40	427.10	430.25	439.15	8.90	2.03
భారతి ఇన్‌ఫ్రాటెల్	353.90	336.15	338.55	344.95	6.40	1.86
వేదాంత	331.00	312.60	315.70	321.65	5.95	1.85
విప్రో	298.20	288.00	289.35	294.65	5.30	1.80
ఎస్ బ్యాంకు	344.00	330.60	332.90	338.75	5.85	1.73
ఇండియాబుల్స్	1,326.50	1,257.00	1,274.10	1,294.95	20.85	1.61
హెచ్‌సిఎల్ టెక్	959.00	922.00	938.55	953.85	15.30	1.60
బోష్	19,756.00	19,165.10	19,244.75	19,556.10	311.35	1.59
లార్సె	1,370.00	1,330.00	1,333.75	1,353.05	19.30	1.43

పృథ్వీ–2 ప్రయోగం సక్సెస్



బాలాసోర్: స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సామర్థ్యం గల పృథ్వీ–2 క్షిపణిని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. బుధవారం ఉదయం 11.35 గంటలకు ఈ క్షిపణిని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ లాంచ్ కాంప్లెక్స్–3 నుంచి విజయవంతంగా ప్రయోగించామని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇది ఉపరితలం నుంచి ఉపరితలంపై 350 కిలో మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదిస్తుందని తెలిపారు. ద్రవ్య ఇంధనం నింపిన జంట ఇం జన్లను దాదాపు 500 నుంచి 1000 కిలోల సామర్థ్యం గల అణ్వాస్త్రాలను మోసుకెళ్తుందన్నారు. అడ్వాన్స్‌డ్ ఇనెర్షియల్ గైడెన్స్ సిస్టంను విక్షేపంతో అనుసంధానించడంతో నిర్ధారిత లక్ష్యాన్ని ఛేదిస్తుందన్నారు. శిక్షణలో భాగంగా డిఆర్‌డిఎ పర్యవేక్షణలో ఆర్మీ వ్యూహాత్మక బలగాల కమాండ్ ఈ ప్రయోగ కార్యక్రమాలన్నింటిని నిర్వహించింది. ఇంటెగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ (ఐజిఎండిపి) కింద డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన తొలి క్షిపణి అగ్ని–2ను 2003లో సైన్యంలో ప్రవేశ పెట్టారు.



ప్రధాని భార్యకు స్వల్ప గాయం

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భార్య జషోదాబెన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమె ప్రయాణిస్తున్న కారు రాజస్థాన్ చిట్టోర్‌గఢ్‌లో ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో జషోదాబెన్‌కు గాయాలు కాగా, ఆమె బంధువు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రధాని భార్యకు పెద్దగా గాయాలు కానప్పటికీ ఆమెతో ప్రయాణిస్తున్న మరో నలుగురు తీవ్రంగా గాయపడినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పర్సోలి శ్యామ్ సింగ్ చెప్పారు. చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తిని జషోదాబెన్ బంధువైన బసంత్ భాయ్ మోడీ (67)గా గుర్తించామన్నారు. కోటా జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి చిట్టోర్‌గఢ్‌కు వెళ్తుండగా పర్సోలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు ప్రమాదానికి గురైందని పోలీసులు పేర్కొన్నారు. ముందుగా వెళ్తున్న ట్రక్కు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనకాలే ఉన్న ప్రధాని భార్య ప్రయాణిస్తున్న కారు ట్రక్కును ఢీకొందన్నారు. ప్రమాద సమయంలో కారులో మెహసానా పోలీసుకు చెందిన ఇద్దరు కమాండోలు కూడా ఉన్నారని వారు తెలిపారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

జర్నలిస్టులపై దాడి కేసుల్లో మూడేళ్లలో 108 మంది అరెస్టు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 2015–17లో సంవత్సరాల్లో జర్నలిస్టులపై జరిగిన దాడులకు సంబంధించి 90 కేసుల్లో దాదాపు 108 మందిని అరెస్టు చేసినట్లు బుధవారం రాజ్యసభకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గత మూడేళ్లలో సేకరించిన సమాచారాన్ని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ అహిర్ సభలో వెల్లడించారు. 2017లో జర్నలిస్టులపై దాడి కేసులు 15 నమోదుకాగా, ఈ కేసుల్లో 26 మందిని అరెస్టు అయ్యారన్నారు. రాజస్థాన్‌లో మూడు కేసుల్లో అత్యధికంగా 22 మంది అరెస్టు కాగా, త్రిపురలో మూడు కేసుల్లో ఒక వ్యక్త అరెస్టు అయినట్లు మంత్రి వివరించారు. 2016లో నమోదైన 47 కేసుల్లో 41 మంది అరెస్టు అయ్యారన్నారు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో నమోదైన 41 కేసుల్లో 12 మందిని అదులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నస్టులపై జరిగిన దాడి కేసుల్లో 9 మంది, త్రిపురలో నలుగురు అరెస్టు అయినట్లు మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా 2015లో రికార్డు అయిన 28 కేసుల్లో 41 మందిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అయితే మీడి యా ప్రతినిధులపై దాడి చేసింది ఎవరు, ఏ సంస్థలు అనేది హోంమంత్రిశాఖ వద్ద ఎలాంటి సమాచారం లేదని హన్సరాజ్ రాజ్యసభలో వివరించారు.

1500 మంది ఐఎఎస్‌ల కొరత

న్యూఢిల్లీ : దేశంలో దాదాపు 1500 మంది ఐఎఎస్ అధికారుల కొరత ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. అధికారికంగా 6500 మంది ఐఎఎస్ అధికారులు ఉండాల్సి ఉండగా, జనవరి 1, 2017 నాటికి 5004 మందే ఉన్నారని, 1496 ఖాళీలు ఉన్నాయని కేంద్ర సిబ్బంది శాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్రాల వారిగా వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ 621 మంది అధికారులు పని చేయాల్సి ఉండగా, 515 మంది, బీహార్‌లో 342కు 243, పశ్చిమ బెంగాల్‌లో 359కి 277, మధ్యప్రదేశ్‌లో 439కి 341, కేరళలో 231కి 150 మంది ఐఎఎస్ అధికారులు ఉన్నారన్నారు. అదే విధంగా తమిళనాడులో 376 మందికి 289 మంది, రాజస్థాన్‌లో 313కి, 243, జార్ఖండ్‌లో 215కి 144, హర్యానాలో 205కి 155, గుజరాత్‌లో 297 మందికి, 241, హిమాచల్‌ప్రదేశ్‌లో 147కు 115, జమూకశ్మీర్‌లో 137కు 91, నాగాలాండ్‌లో 94కు 67 మంది, సిక్కింలో 48కి 37 మంది అధికారులు, తెలంగాణలో 208 మందికి, 130, పంజాబ్‌లో 221కి 182 మంది, ఛత్తీస్‌గఢ్‌లో 193 మంది అధికారులకు 154 మంది అధికారులు ఉన్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నేరుగా నియామకాలు జరుపుతూ ఏటా కొంతమందిని పెంచిందని, గత ఆరేళ్లల్లో 180 మందిని ఈ పద్ధతిలో తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ రాష్ట్రాల్లోనే కాకుండా మిగతా రాష్ట్రాల్లో కూడా పని చేస్తున్న ఐఎఎస్‌ల సంఖ్యను కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.

రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మృతి

కటక్: మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని అలిరాపుర్ జిల్లాలో తెల్లవారు జామున ఇసుక ట్రాక్టర్ బోల్తా పడటంతో ఎనిమిది మంది కూలీలు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మురికి నీటి కాలువలో కూరుకుపోయిన టైర్ బిగుసుకు పోవడంతో ట్రాక్టర్ తలక్రిందులయిందని అదనపు ఎస్‌పి సీమా అలవా మీడియాకు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు ట్రక్టర్‌పైన కూలీలు, స్థానిక గిరిజనలు కూర్చుని ఉన్నారన్నారు. మృతుల్లో ఎక్కువ మంది ఇసుకను లోడ్ చేసిన కూలీలని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ పారిపోయినట్లు ఆమె తెలిపారు. గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. కాగా, మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు.

మార్చి 15 నుంచి 17 వరకు అంతర్జాతీయ అక్వాక్స్ ఎగ్జిబిషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయ అక్వాక్స్ ఎగ్జిబిషన్‌ను హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో మార్చి 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మత్స్యకారులను సామాజికంగా ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందన్నారు. సచివాలయంలో బుధవారం ఆక్వాక్స్ ఇండియా 2018 పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సొసైటీఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వాకల్చర్ సంస్థ సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంతర్జాతీయ ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అభివృద్ధిపరచిన సాంకేతిక విధానాలు, కొత్త జాతులు వాటిని ఉత్పత్తిచేసే విధానాలు, మంచి యంత్ర సామాగ్రి, నాణ్యమైన ఉత్పత్తులు, ఉత్తమ మార్కెటింగ్ పద్ధతులు, వినియోగదారులకు నాణ్యత పై అవగాహన కల్పించడం, మానవ వనరుల నైపుణ్య అభివృద్ధికి కృషి వంటి అంశాలపై మత్స్యకారులందరికి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మత్యరంగంలో మన రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక కార్యదర్శి సందీప్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ పాల్గొన్నారు.

విభజన సమస్యల పాపం కాంగ్రెస్‌దే

- పార్లమెంట్ తలుపులు మూసి ఎపిని విభజించారు
- విభజన హామీలు పరిష్కరిస్తాం
- కాంగ్రెస్ నిర్వాకం వల్లే ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించారు
- లోక్‌సభలో కాంగ్రెస్‌పై మోడీ ధ్వజం



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని యుపిఎ ప్రభుత్వం విభజించిన తీరుపై ప్రధాని మోడీ నిప్పులుగక్కారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో మోడీ మాట్లాడుతుంగా ఆంధ్రప్రదేశ్ ఎంపిలు ఆందోళన, నినాదాలు కొనసాగిస్తుండడంతో ప్రధాని స్పందించారు. ఆంధ్రుల మనోభావాలు దెబ్బతినకుండా ఆంధ్రప్రదేశ్‌ను విభజించాలని అప్పుడూ, ఇప్పుడూ చెబుతూనే ఉన్నామని, కానీ కాంగ్రెస్ అలాంటి సూచనలేవీ పట్టించుకోకుండా ఎన్నికల్లో కేవలం లబ్ధి పొందడం కోసం పార్లమెంటు తలుపులు వేసి విభజన చేసిందన్నారు. నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్ చేసిన ఆ పాపాన్ని ఏపీ నేటికీ అనుభవిస్తోందని విమర్శించారు. 'వాజ్‌పేయి ప్రభుత్వం దీర్ఘదృష్టి కారణంగా మూడు రాష్ట్రాలు విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు ఆయా రాష్ట్రాలకు వివాదం లేకుండా పంచిపెట్టారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింపజేసుకున్నారు. నామమాత్రం ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా వ్యవహరించింది. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఈనాడు ప్రతిపక్షంలో కూర్చున్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదు. తమిళనాడు, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని అణచివేసింది' అని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన తీరుపైనే సమస్యలున్నాయని, వాటన్నింటినీ పరిష్కరిస్తామని మోడీ చెప్పారు. తాము టిడిపి కలిసి పనిచేస్తున్నామని, ఏపీకి అండగా ఉంటామని హామీనిచ్చారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావాన్ని ప్రధాని గుర్తు చేశారు. తెలుగు జాతికి కాంగ్రెస్ చేసిన ద్రోహం కారణంగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిందని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసమే ఆనాడు ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చారని మోడీ చెప్పారు. తెలుగు వాళ్లను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావును కాంగ్రెస్ అవమానించిందని ఆరోపించారు. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించి వెన్నుపోటు పొడిచిన చరిత్ర కూడా కాంగ్రెస్‌దేనన్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో రాజీవ్‌గాంధీ సాక్షిగా అప్పటి ముఖ్యమంత్రి అంజయ్యకు అవమానం జరిగిందని అన్నారు.

రేణుకపై మోడీ సెటైర్లు..



రాజ్యసభలో మోడీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్వాతంత్ర్యం తర్వాత దేశానికి కాంగ్రెస్ అవసరం లేదని మహాత్మాగాంధీయే చెప్పారని, కాంగ్రెస్ లేని భారత్ నినాదం తనది కాదని గాంధీజీదేనని వ్యాఖ్యానించారు. మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎంపి రేణుకా చౌదరి ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలే యత్నం చేశారు. దీంతో చైర్మన్ వెంకయ్యానాయుడు కలుగజేసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ వద్దకు వెళ్లాలంటూ రేణుకా చౌదరికి చురకలంటించారు. అనంతరం మోడీ ప్రసంగం వింటూ రేణుకా చౌదరి పెద్దగా నవ్వడంతో...ప్రధాని స్పందించారు. 'అప్పట్లో రామాయణం సీరియల్‌లో అలాంటి నవ్వులు విన్నాం.. ఇప్పుడు మరోసారి వినాల్సి వస్తోంది' అం టూ సెటైర్ వేశారు. మోడీ వ్యాఖ్యతో అధికార పక్ష సభ్యులంతా బల్లలు చరుస్తూ పెద్ద పెట్టున నవ్వుకున్నారు.

కెవిపి సస్పెన్షన్: కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సభలో ప్లకార్డులు చేతబూని ఆందోళన చేపట్టారు. దీంతో ఆయన్ని సభ నుంచి ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు.

దురహంకార సర్కార్

- రాజ్యసభలో ధ్వజమెత్తిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ(బిజెపి) ప్రభుత్వం దురహంకారం, అసహనపూరితమైనదని రాజ్యసభలో బుధవారం కాంగ్రెస్ ధ్వజమెత్తింది. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మసిపూసి మారేడు కాయ చేస్తున్నదని, పెద్దపెద్ద హామీ లు గుప్పిస్తూ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నదని ఆరోపించింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాన పునఃచర్చలో పాల్గొన్న కాం గ్రెస్ నాయకుడు అహ్మద్ పటేల్ 'బిజెపికి మిత్రపక్షాలైన శివసేన, తెలుగుదే శం, శిరోమణి అకాలీదళ్ వంటివి కూడా బిజెపి చెబుతున్న విషయాలను అం గీకరించడంలేదు' అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ కోసం ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా రాజ్యసభ చేపట్టలేదు. వాస్తవ పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నందునే ఉత్తర్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించడానికి బిజెపి ఆసక్తి చూపడంలేదని, ఒకవేళ ఉప ఎన్నికలు నిర్వహిస్తే మెజారిటీ కన్నా తక్కువ మార్కుకు పడిపోతుందని భావిస్తోందని అన్నారు. దేశంలో 'అభద్రతాభావం' నెలకొని ఉందని కూడా అహ్మద్ పటేల్ చెప్పా రు. బిజెపి నాయకులకు కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని ఎలా అప్రతిష్టపా లు చేయాలన్నదొకటే తెలుసునని ఆరోపించారు. 2014 తర్వాత బిజెపి బలం 282 నుంచి 273కు పడిపోయిందని, కానీ కాంగ్రెస్ బలం పెరిగిందని ఉటంకించారు. ప్రచారంతో పైస్థాయికి చేరుకోవడం సులభమే. కానీ పైస్థాయిలో నిలదొక్కుకోవడం అనేదే పెద్ద సవాలు అంటూ ఆయన ఉర్దూ కవితా పంక్తు లు చదివారు. గుజరాత్‌లో మేము ఓడినప్పటికీ చాలా వరకు గెలిచామని అ హ్మద్ పటేల్ చెప్పారు. నితిన్ గడ్కరీ బహుళ జాతీయ రోడ్డు ప్రాజెక్టుల గురిం చి ప్రకటించారే తప్ప వాస్తవానికి జరిగిందంటూ ఏమీ లేదు అని విమర్శించారు. బిజెపి గొప్ప వాగ్దానాలే చేస్తోంది తప్ప వాస్తవంలో వాటిని అమలు చేయడంలో వెనుకంజలోనే ఉందన్నారు. బడ్జెట్‌లో తమిళనాడుపట్ల నిర్లక్ష్యం వహించారని డిఎంకె సభ్యుడు ఆర్‌ఎస్ భారతి అన్నారు. ఆయన రైతు ల సేద్యపు నీటి సమస్యను, తమిళనాడు అసెంబ్లీ నీట్‌పై చేసిన తీర్మానాన్ని లేవనెత్తారు.

బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

లోక్‌సభలో టిఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి



మనతెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యా యం జరిగిందని లోక్ సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత ఎంపి జితేందర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం కేంద్ర బడ్జెట్ పై చర్చ సందర్భంగా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ కు ఇచ్చిన హామీలలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పాలసీలకు అయ్యే భారం మొత్తాన్ని కేంద్రమే భరించాలని, ఆ పేరు తో రాష్ట్రప్రభుత్వాలపై భారం మోపడం సరికాదని ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రకటనలో స్పష్టత లేదన్న ఆయన దీనికి సంబంధించిన విధివిధాలపై కేంద్రం మరింత స్పష్టంగా ప్రకటన చేయాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ కోసం కేంద్ర బడ్జెట్ లో కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుపై పలు మార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినప్పటికీ, కొందరు ఎంపిలు స్వయంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలసినప్పటికీ ప్రయోజం లేదన్నారు. చిన్న రాష్ట్రమే అయినా అభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిపథంలో పయనిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని వెల్లడించారు. రైతులకు మద్దతు ధర అంశంలో బడ్జెట్‌లో స్పష్టత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ గందరగోళంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పరంగా కాకుండా మంత్రిత్వ శాఖల పరంగా బడ్జెట్ కేటాయించిందని జితేందర్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం నుంచి ఈ కొత్త విధానాన్ని కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు.

రాఫెల్ వివరాలు వెల్లడించం: ప్రభుత్వం

- దేశ రక్షణలో రాజీపడలేం

న్యూఢిల్లీ: రూ.58,0000 కోట్లకు 36 రాఫెల్ జెట్ విమానా కొనుగోలు ఒప్పందంలో అసలు కంటే ఎక్కువ రేటు చెల్లించారన్న ప్రతిపక్షాల ఆరోపణను ప్రభుత్వం బుధవారం నిరాధారం అని పేర్కొంది. ఆ ఒప్పందం, విమానాల ధర వివరాలు తెలుపడం అంటే జాతీయ భద్రత విషయంలో రాజీ పడినట్లే కాగలదని, కనుక వివరాలు తెలుపబోమని స్పష్టం చేసింది. రక్షణ రంగానికి సేకరించే వేటి విలువ వెల్లడించే ప్రసక్తి లేదని పేర్కొంటూ రక్షణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. రక్షణ రంగానికి అవసరమ య్యే వాటి సేకరణ వివరాలు గుప్తంగానే ఉంచుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2008 ఇండో–ఫ్రాన్స్ ఒప్పందం రహస్యాన్ని కాపాడే అంశంలో ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపింది. ఫ్రాన్స్ నుంచి 36 రాఫెల్ జెట్ విమానాల కొనుగోలులో నిరాధార ఆరోపణలు చేస్తుండడాన్ని ప్రభుత్వం తప్పు పట్టింది. జాతీయ భద్రతకు సంబం ధించిన అంశంలో పదేపదే తప్పుడు ప్రకటనలు చేస్తూ తీరని నష్టాన్ని కలిగిస్తున్నారని రక్షణ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. రాఫెల్ ధరను వివరించడానికి ప్రభుత్వం నిరాకరించడంతో కాంగ్రెస్ విమర్శలకు దిగింది. 2017 నవంబర్ 17న రక్షణ మంత్రి సీతారామన్‌ను రాఫెల్ జెట్ ధర వివరాల గురించి అడిగినప్పుడు వివరాలు త్వరలోనే తెలుపతామని అన్నారు. కానీ ప్రభుత్వం తర్వాత వాటి వివరాలు వెల్లడించలేదు.



మీరూ బసవన్న బోధనలు అనుసరించండి

- ప్రధానికి కర్ణాటక సిఎం సిద్ధరామయ్య సూచన



బెంగళూరు: పార్లమెంటు ప్రసంగంలో బుధవారం 12 వ శతాబ్దపు సామాజిక సంస్కర్త బసవేశ్వర గురించి తనకు గుర్తు చేయడం బాగానే ఉన్నప్పటికీ ఆయన కూడా బసవన్న బోధనలు పాటిస్తే కన్నడిగులు కృతజ్ఞులై ఉంటారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య అన్నారు. తన ట్వీట్‌లో 'ప్రధాని నరేంద్ర మోడీ, పార్లమెంటులో ఈ రోజు నాకు గుర్తుచేసినందుకు మంచిదే. మీరు కూడా బసవన్నను గుర్తుంచుకున్నందుకు ఆనందం' అని పోస్ట్ చేశా రు. 'సంపన్నులు ఆలయాలు నిర్మిస్తారు. పేదవాడినైన నేనేమి చేయగలను?' అని బసవ అన్నట్లు ... సార్! మీరు బసవన్న బోధనలు పాటిస్తే కన్నడిగులు కృతజ్ఞులై ఉంటారు' అని ఆయన చెప్పారు. 'దేశంలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించింది జవహర్‌లాల్' అని పేర్కొన్నప్పుడు మో డీ కాంగ్రెస్ వాదనను తిప్పికొట్టారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ప్రసంగిస్తూ మోడీ 12వ శతాబ్దిలోనే జగద్గురు బసవేశ్వరుడున్నప్పుడు దేశంలో ప్రజాస్థాపన మొదలైంది అన్నారు. ఈ విషయాన్ని మోడీ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గేకు గుర్తు చేశారు. '

లోయా మృతిపై సిట్‌కు డిమాండ్

కటక్: జస్టిస్ లోయా మృతిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ఏర్పాటుకు డిమాండ్ చేస్తూ రాష్ట్రపతికి లేఖలు రాయాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. 100 మందికిపైగా పార్లమెంట్ సభ్యులు సంతకాలు చేసిన లేఖను గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పంపించనున్నట్లు తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రియన్ విలేకరులకు తెలిపారు.స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ప్రత్యేక సిబిఐ న్యాయమూర్తి లోయా ఎలా మృతి చెందారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన మృతిపై ఎన్నో కథనాలు వినిపిస్తున్నాయని, ఈ సమస్యకు సుప్రీం ఆధ్వర్యంలోని సిట్ మాత్రమే పరిష్కరిస్తుందని ఆయన పేర్కొన్నారు. సున్నితమైన సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న లోయా డిసెంబర్‌లో తన సహోద్యోగి కుమార్తె వివాహానికి హాజరై గుండె పోటుతో మృతి చెందారు.

దురాక్రమణదారులు కాదు, విమోచకులు!

- భారత్‌కు మాల్దీవుల మాజీ అధ్యక్షుడు నషీద్ కితాబు
- జోక్యం చేసుకోవాలని పునరుద్ఘాటన
- ఇండియా జోక్యాన్ని ఒప్పుకోబోం : చైనా





నషీద్

కొలంబో/మాలె: రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయిన మాల్దీవుల్లో భారత్ జోక్యం చేసుకోరాదని చైనా హెచ్చరించిన నేపథ్యంలో ప్రవాస జీవితం గడుపుతున్న మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ భారత్ జోక్యం చేసుకోవలసిందేనని పునరుద్ఘాటించారు. తమ దేశస్థులు భారత్ పాత్ర పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. 1988లో కూడా తమ దేశంలో సంక్షోభం ఏర్పడినప్పుడు భారత్ జోక్యం చేసుకుందని గుర్తు చేశారు. అప్పట్లో సమస్యను పరిష్కరించి మాల్దీవులను సురక్షితంగా తిరిగి తమకు అప్పగించారని పేర్కొన్నారు. ఆయన బుధవారం తన ట్వీట్‌లో ఈ వివరాలు తెలిపారు.'చైనా చెప్పినట్లు సమస్యను అంతర్గతంగా పరిష్కరించడమంటే తిరుగుబాటును విస్తరించాలని మాకు చెప్పడం వంటిదే. ఇది అరాచకానికి దారి తీస్తుంది. మాల్దీవుల ప్రజలు భారత్ పాత్రను సానుకూలంగా చూస్తున్నారు. 1988లో వచ్చారు, సంక్షోభాన్ని పరిష్కరించారు. తిరిగి వెళ్లిపోయారు. భారతీయులు దురాక్రమణదారులు కాదు. విమోచకులు. అందుకే మాల్వీవుల ప్రజలు భారత్‌వైపు ఆశతో చూస్తున్నారు' అని నషీద్ పేర్కొన్నారు. 'భారత ప్రభుత్వం రాయబారిని, సైన్యాన్ని పంపించాలి. నిర్బంధంలో ఉన్న మాజీ అధ్యక్షుడు గయూమయ్, న్యాయమూర్తులు, రాజకీయ ఖైదీలను విడిపించాలి. వారిని తిరిగి వారి ఇళ్లకు చేర్చాలి. భారత సైన్యం మాల్దీవుల్లో కాలు పెట్టాలని కోరుకుంటున్నాం. మాల్దీవుల ప్రభుత్వంతో అమెరికా బ్యాంకుల ద్వారా లావాదేవీలన్నిటినీ నిలిపేయాలని అమెరికాను కోరుతున్నాం' అని నషీద్ స్పష్టం ట్వీట్ చేశారు. భారత్ ఇప్పటికీ పరిస్థితిని గమనిస్తోంది. మాల్దీవుల్లో అత్యాయిక స్థితి ప్రకటించడంపై కలత చెందామని కూడా మంగళవారం పేర్కొంది. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సయీద్, హమీద్‌లకు, కోర్టు అధికారి హస్సన్ సయీద్‌కు లక్షలాది డాలర్ల లంచం ఇచ్చారనే సాక్ష్యాలు లభించాయని మాల్దీవుల్లోని తాత్కాలిక పోలీస్ చీఫ్ అబ్దుల్లా నవాజ్ విలేకరులకు చెప్పారు. గయూమ్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి రాజకీయవేత్తలకు, న్యాయమూర్తులకు లంచం ఇచ్చారని పోలీసులు నమ్ముతున్నారని కూడా చెప్పారు. హసన్ సయీద్ పరుపు నుంచి చాలా డబ్బు స్వాధీనం చేసుకున్నామని కూడా చెప్పారు.

అంతర్జాతీయ సంస్థలకు యామీన్ సర్కార్ ఆహ్వానం

అత్యవసర పరిస్థితిని ప్రకటించి అంతర్జాతీయంగా మచ్చపడ్డ మాల్దీవుల ప్రభుత్వం ఇప్పుడు పరువు కాపాడుకునే ప్రయత్నాలు చేస్తోంది. దేశంలో ఉన్న పరిస్థితిని అంచనా వేయడానికి వచ్చి చూడండి అంటూ అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు మాల్దీవ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. కర్ఫ్యూను విధించలేదని, ప్రజలు స్వేచ్ఛగానే తిరుగాడుతున్నారు, సేవలు, వ్యాపారాలు దెబ్బతినలేదని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మాల్దీవుల్లో ప్రజా జీవన పరిస్థితి మామూలుగానే ఉందని కూడా పేర్కొంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలు, సామాజిక సేవలు, పర్యటన రంగం, విమానాశ్రయాలు వంటివన్నీ యథాతథంగానే పనిచేస్తున్నాయని తెలిపింది. అయితే తొమ్మిది మంది హైప్రొఫైల్ రాజకీయ ఖైదీలను విడుదల ఉత్తర్వులను సుప్రీంకోర్టు మంగళవారం రాత్రి ఉపసంహరించుకోవడం గమనించాల్సిన విషయం.



ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలు తప్పవు : పెన్స్

టోక్యో: త్వరలో ఉత్తర కొరియాపై 'కఠిన ఆంక్షలు' విధించడం తప్పదని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ బుధవారం చెప్పారు. ఒలింపిక్స్‌కు ఉత్తర కొరియా 'హైజాక్' చేయడాన్ని అనుమతించబోమని కూడా హెచ్చరించారు. దక్షిణ కొరియా శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి హాజరవ్వడానికి వెళుతున్న ఆయన జపాన్‌లో ఈ విషయాన్ని చెప్పారు. ఉత్తర కొరియా ఆంక్షల విధింపు విషయంలో జపాన్‌తో కలసి పనిచేస్తున్నామన్నారు. వివరాలు తెలుపకుండానే ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉందని మైక్ పెన్స్ తెలిపారు. అమెరికా, ఉత్తర కొరియా మధ్య మాటాల యుద్ధం ఇప్పటకీ తీవ్రంగానే ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర కొరియా అణ్వాయుధ దేశంగా ఉండడాన్ని అమెరికా, జపాన్ ఆమోదించబోవని జపాన్ ప్రధాని షింజో అబె అన్నారు. జపాన్ గుండా దక్షిణ కొరియాకు బయలు దేరిన మైక్ పెన్స్ శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో ఉత్తర కొరియా ప్రతినిధి బృందంతో సమావేశం కూడా కాబోనని స్పష్టం చేశారు. 'నేనైతే వారితో సమావేశాన్ని కోరలేదు. కానీ అక్కడ ఏమి జరగనుందో వేచి చూద్దాం' అన్నారు. అయితే ఒలింపిక్ గేమ్స్‌ను ఉత్తర కొరియా హైజాక్ చేయకుండా చూసే సందేశం ఇవ్వాలని టోక్యో కఠిన వైఖరిననుసరిస్తోంది.

శాఖల మధ్య సమన్వయం

కార్యదర్శుల సమావేశంలో సిఎస్



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని, ఇందుకోసం అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి వ్యాఖ్యానించారు. వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు రెవిన్యూ, ప్లానింగ్, హోం, న్యాయ, పరిశ్రమలు, ఐటి, అటవీ, పౌర సరఫరాలు, సాగునీటిపారుదల, సాధారణ పరిపాలన తదితర శాఖల కార్యదర్శులతో సిఎస్ బుధవారం సమీక్ష జరిపారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాల పురోగతిని, సాధించిన ప్రగతిని, ప్రజలకు అందుతున్న లబ్ధిని సమీక్షించారు. అనంతరం అన్ని శాఖల కార్యదర్శులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతీ శాఖ నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించుకోవాలని, మెరుగైన ఫలితాల కోసం వివిధ శాఖలతో సమన్వయంతో ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పంటల సాగు, పంటల ఉత్పత్తి, సాగునీటి సౌకర్యం, ఎరువులు విత్తనాల పంపిణీ, పశుగ్రాసం లభ్యత, చేపల పెంపకం, గుడ్లు మాంసం ఉత్పత్తి తదితరాలపై ఆయా శాఖల కార్యదర్శులతో సిఎస్ సమీక్షించి సూచనలు చేశారని పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం తెలియజేసింది. పశుగ్రాసం విషయంలో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, గోదాములు, వ్యవసాయంలో యాంత్రికీకరణ, సబ్సిడీలు, సేంద్రియ ఎరువులు తదితరాలపై సమీక్షించినట్లు ప్రభుత్వం పేర్కొనింది. మొక్కల పెంపకం, కాలుష్య నివారణ, అటవీ కార్పొరేషన్ ద్వారా జరుగుతున్న పనులు తదితరాలపై చర్చ జరిగిందని పేర్కొనింది. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేస్తున్న ఉత్తర్వులు సామాన్య ప్రజలకు అర్థమయ్యేందుకు ఇకపైన తెలుగులో కూడా ఉండేలా చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు.టెక్స్‌టైల్ పార్కు, ఫార్మాసిటీ, నిమ్జ్, ఫుడ్ ప్రాసెసింగ్, లెదర్ పార్కు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, జినోమ్ వ్యాలీ, పారిశ్రామిక క్లస్టర్లు.. ఇలా పలు అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు.


గాలి ముద్దుకృష్ణమ నాయుడు కన్నుమూత



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎంఎల్‌సి గాలి ముద్దుకృష్ణమ నాయుడు మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. జ్వరం, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ముద్దుకృష్ణమ నాయుడు 1947 జూన్ 9న చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురంలో జి.రామానాయుడు, రాజమ్మ దంపతులకు జన్మించారు. బిఎస్‌సి, ఎంఎతో పాటు న్యాయవాద డిగ్రీ పట్టా పొందారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేసిన ముద్దుకృష్ణమనాయుడు ఎన్‌టిఆర్ పిలుపుతో 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. పుత్తూరు నుంచి ఆరుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించి రికార్డులకెక్కారు. 1984లో విద్యాశాఖ మంత్రిగా, 1987లో అటవీ శాఖకు, 1994లో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. టిడిపితో విభేధించి కాంగ్రెస్‌లో చేరి 1999 ఎన్నికల్లో పుత్తూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంఎల్‌ఏగా గెలుపొందారు. తిరిగి 2008లో టిడిపిలో చేరి 2009 ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి ఎంఎల్‌గా గెలిచారు. 2014 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తరువాత టిడిపి నుంచి ఎంఎల్‌సిగా కొనసాగుతున్నారు. తెలుగురాష్ట్రాల్లో ఆయన అందరికీ సుపరిచితులు. విపక్షాలపై ధ్వజమెత్తడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఆయన మరణంతో టిడిపి వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. ముద్దుకృష్ణమ స్వగ్రామమైన వెంకట్రామాపురంలో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు ముగించారు.

పలువురి సంతాపం.. నివాళులు : అనారోగ్యంతో కన్నుమూసిన గాలి ముద్దుకృష్ణమ నాయుడుకి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు నివాళులర్పించారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు వెంకట్రామాపురంలో ముద్దకృష్ణమ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంతకుముందు ఆయన మృతి సమాచారం తెలుసుకున్న నేతలు బంజారాహిల్స్ లోని కేర్ ఆస్పత్రికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, టిడిపి నేతలు బుద్ధా వెంకన్న, ఎల్.రమణ,మోత్కుపల్లి నర్సింహులు, నామానాగేశ్వరరావు, కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, నల్గొండ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎన్‌టిఆర్ కుమారులు హరికృష్ణ, రామకృష్ణ, సినీనటుడు చలపతిరావు, లక్ష్మీ పార్వతి తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎంఎల్‌ఏ నందమూరి బాలకృష్ణ, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి సంతాపం ప్రకటించారు. పార్టీకి ఆయన మృతి తీరని లోటని టిడిపి నేతలు పేర్కొన్నారు.ముద్దుకృష్ణమ మృతితో చంద్రబాబు బుధవారం కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నారు.

ఎపిలోనూ జెఎసి : పవన్



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ సాధన కోసం అన్ని పార్టీలూ కలిసి కట్టుగా పనిచేసిన విధంగా ఎపిలోనూ ఐక్య కార్యాచరణ కమిటీ (జెఎసి) ఏర్పాటు చేసి పని చేయాల్సిన అవసరం ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమా ర్, జయప్రకాశ్ నారాయణ్ వంటి మేధావులను కలుపుకొని జెఎసి ఏర్పాటుకు సముఖంగా ఉన్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్, నీలం సంజీవరెడ్డిల గురించి మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్రమోడి ప్రత్యేక హోదా, ప్యాకెజీ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని జనసేన పరిపాలన కార్యాలయంలో బుధవారం పవ న్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఒక వేదిక రూపొందించాలని, తెలంగాణ జెఎసి మాదిరిగా ఇక్కడ కూడా మేధావులంతా ఏకం కావాల్సిన అవసరం ఉంది. విభజన సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు తీర్చడం లేదని ప్రశ్నించడానికి తాను ఒక్కడినే సరిపోనన్నారు.రెండు ప్లకార్డులు నాలుగు స్లోగన్స్ ఇస్తే పనికాదన్నారు. ఎపికి కేంద్రం నుంచి వచ్చిన నిధులపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రం లో ఓ మాట, పార్లమెంట్‌లో మరో మాట మాట్లాడుతున్నారన్నారు.బంద్‌లు చేయడమమంటే మనల్ని మనమే కొట్టుకున్నంట్లు అని, అయితే తప్పని పరిస్థితుల్లో శాంతియుతంగా నిర్వహించే బంద్‌లకు జనసేన మద్దతు ఉంటుందని అని పవన్ పేర్కొన్నారు. తాను కాకినాడ సభ తరువాత ప్రత్యేక హోదా పోరాటం చేద్దామనుకున్నాని అయితే కొందరు వద్దని వారించడంతో వెనక్కి తగ్గినట్లు తెలిపారు. జనసేన 2014లో పోటీ చేసి కొన్ని సీట్లు గెలిస్తే గొంతు బలంగా వినిపించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఆ బాధ ఉందన్నారు.

దేశాన్ని ముంచారు

(మొదటిపేజీ తరువాయి)

వేస్తుంటే.. ఎవరైతే ఈ దేశంలో ఆధార్‌ను ప్రవేశపెట్టారో వాళ్లే ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోడీ ఆక్షేపించారు. పైగా ఆధార్‌ను పక్కనబెట్టాలని డిమాండ్ కూడా చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్యుల ధనాన్ని దోచుకుని దేశం విడిచి పారిపోయిన వాళ్లు తిరిగి వచ్చేలా చేస్తామని ప్రధాని స్పష్టం చేశారు.

ఆ నాలుగు రాష్ట్రాల్లోనే కోటి ఉద్యోగాలు...: ఎన్‌డిఎ హయాంలో ఉద్యోగాల కల్పన మృగ్యమైందన్న విమర్శలను మోడీ తిప్పికొట్టారు. కోటిమంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు చేరువయ్యామని ప్రతిపక్షాల పాలనలో ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళ, ఒడిశా, కర్నాటక రాష్ట్రాలే స్వయంగా వెల్లడించాయని, ఇక బిజెపి పాలిత రాష్ట్రాల గురించి చెప్పదలుచుకోలేదన్నారు. నిరుద్యోగుల సంఖ్యను చూపిస్తూ మా ప్రభుత్వాన్ని బదనాం చేసే వాళ్లు ఉద్యోగాలు వచ్చిన వారి సంఖ్యను కూడా గుర్తు పెట్టుకోవాలన్నారు. 18–25ఏళ్ల మధ్య వయసున్న యువకులు 70లక్షల మంది కొత్తగా ఇపిఎఫ్ ఖాతాల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. యువత ఆశయాలకు స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా పథకాల ద్వారా రెక్కలు తొడుగుతున్నామ న్నారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని విపక్షాలకు హితవు చెప్పారు. విదేశీ గడ్డపై దేశం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాహుల్‌ను ఉద్దేశించి మోడీ విమర్శించారు. డోక్లామ్‌లో చైనా సైన్యానికి వ్యతిరేకంగా భారత సైన్యం గట్టిగా నిలబెడితే పొరుగుదేశం అధికారులతో కాంగ్రెస్ నేత ఎలా సమావేశమవుతారని ప్రశ్నించారు. పాక్‌తో షిమ్లా ఒప్పందాన్ని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కుదుర్చుకుంటే వాజ్‌పేయి బహిరంగంగా విమర్శలు చేయకుండా ఇందిరతో వ్యక్తిగతంగా సమావేశమై తన అభ్యంతరాలను వెలిబుచ్చారని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్‌తో మధ్యతరగతికి ఒనగూరేదేం లేదని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఆ వర్గంలో నిరాశ నిస్పృహలను నిప్పేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్య రంగాల్లో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అభివృద్ధి అప్పుడలా..ఇప్పుడిలా : తన ప్రసంగాన్ని పలుమార్లు అడ్డుకునేందుకు కాంగ్రెస్ ఎంపిలు చేస్తున్న ప్రయత్నాన్ని కూడా తిప్పికొట్టారు. తాను చెప్పేది వినేందుకు ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ తన ప్రసంగాన్ని అడ్డుకుంటోందని మోడీ అన్నారు. పార్టీలు శాశ్వతం కాదు.. దేశమే శాశ్వతమన్న విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలన్నారు. కాం గ్రెస్ పార్టీ హయంలో రోజుకు 11 కిలోమీటర్లు మేర రోడ్లు వేస్తే, తమ హయాంలో రోజుకు 22కి.మీల మేర రహదారులు వేసినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్ష నియోజకవర్గమా? అధికార పక్ష నియోజకవర్గమా? అన్న వైరుధ్యాన్ని తాము చూపించడం లేదని స్పష్టం చేశారు. ఖర్గే ఎంపిగా ఉన్న బీదర్‌లో వాజ్‌పేయి ప్రభుత్వం 1020 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ వేసిందని, ఖర్గే రైల్వేమంత్రిగా ఉండి ఏం చేశారో చెప్పాలని మోడీ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం వచ్చాకే గ్రామాల్లో ఫైబర్‌నెట్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మా హయంలో అతి పొడవైన సొరంగం, వేగవంతమైన రైళ్లు, గ్యాస్ పైప్‌లైన్లు వచ్చాయన్నారు.

రాజ్యసభలో ఈ బిల్లులకు సహకరించండి.. కాంగ్రెస్ ఇప్పటికీ అత్యవసర పరిస్థితి కాలం నాటి, సిక్కులపై దాడులు, కుంభకోణాల భారతదేశాన్నే కోరుకుంటోందని, తాము అలా కాదని నవ భారతాన్ని సృష్టించాలని భావిస్తున్నామని, అందుకు పార్టీలన్నీ సహకరించాలని రాజ్యసభలో మోడీ కోరారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదం తనది కాదని, స్వాతంత్ర్యం తర్వాత మహాత్ముడే కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలని చెప్పారని అన్నారు. పరిమిత సమయంలో బిజెపి లక్ష్య సాధన(ఎయిమ్ చేజర్)కు కృషి చేస్తుందన్నారు. కానీ కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్టు పథకాల పేర్లు(నేమ్ చేంజర్) మార్పు చేయడం లేదని అన్నారు. రాజ్యసభలో ఒబిసి బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం తెలిపేందుకు సహకరించాలని ఎగువసభ సభ్యులను కోరారు. దావోస్ పర్యటనలకు మీరు వెళ్లారు.. నేనూ వెళ్లాను. కానీ మీరు మాత్రం కొందరిని రక్షించేందుకు మాత్రమే లేఖలు పట్టుకొని అక్కడికి వెళ్లారని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. సులభతర వాణిజ్యంలో భారత్ ర్యాంకు మెరుగుపడితే కొందరికి అది ఎందుకు కంటగింపుగా మారిందని మోడీ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం సలహాలు స్వీకరిస్తుందని, అలా చేయకుండా జిఎస్‌టిని వ్యతిరేకించి కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందన్నారు.

మే 23,24 తేదీల్లో ఐసెట్

(మొదటిపేజీ తరువాయి)

టి. పాపిరెడ్డి విడుదల చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఐసెట్ కార్యాలయంలో బుధవారం ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య వెంకటరమణ, ఐసెట్ చైర్మన్, కెయు ఉపకులపతి ఆచార్య ఆర్. సాయన్న, ఐసెట్ కన్వీనర్ ఆచార్య ఎం.సుబ్రమణ్యశర్మలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి ఐసెట్ షెడ్యూల్ వివరాలను తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఐసెట్ నోటిఫికేషన్‌ను ఇవ్వనున్నామని, మార్చి 6వ తేదీ నుంచి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు రూ. 650 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 450 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ. 500 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ. 2000 అపరాధ రుసుముతో మే 10 వరకు, రూ. 5000 అపరాధ రుసుముతో మే 14 వరకు, రూ. 10000 అపరాధ రుసుముతో మే 19 వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షలను మే 23,24 తేదీలలో మూడు సెషన్లలో జరగనున్నాయని, 23న రెండు సెషన్లలో ఉదయం10 నుంచి 12.30 వరకు, మధ్యా హ్నం 2.30 నుంచి 5 గంటల వరకు, 24న ఉదయం 10 నుంచి 12.30 వరకు జరుగుతాయని తెలిపారు. మే 7 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రిలిమనరీ కీని మే 27న విడుదల చేస్తామని, పరీక్షలలో ఏవైనా సందేహాలుంటే జూన్ 4లోపు విద్యార్థులు అభ్యంతరాలు తెలియజేయవచ్చని, అభ్యంతరాలను పరిశీలించి తుది కీతో పాటు ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తామన్నారు. ఈ సారి పరీక్షలను కేవలం ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని, ఎటువంటి ఆటంకాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షలకుగాను మొత్తంగా 16 రీజినల్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణలో 12, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు సెంటర్లను కేటాయించామని తెలిపారు. ఆయా సంబంధిత రీజినల్ సెంటర్ల వారు లోకల్ సెంటర్లను కేటాయిస్తారన్నారు. ఐసెట్ చైర్మన్ ఆచార్య ఆర్. సాయన్న మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం మూలంగా విద్యార్థులు ఎన్నిసార్లు అయినా తప్పులు దొర్లితే మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ విధానం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కన్వీనర్ ఆచార్య ఎం. సుబ్రమణ్యశర్మ మాట్లాడుతూ రీజినల్ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉర్దూ విద్యార్థుల కోసం ఉర్దూలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. గతంలో సుమారు 77 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఈ సారి సుమారు 80 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వివిఎస్ శర్మ, సిహెచ్ రాజేశం, శ్రీరామోజు నర్సింహాచారి, రాజేందర్ పాల్గొన్నారు.

9న కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా 15వ తేదీన రెండు రాష్ట్రాలతో జరిగే సమావేశంలో నిర్ణయాలు ఉండవచ్చని సమాచారం. 9వ తేదీన జరిగే సమావేశానికి కేవలం బోర్డు చైర్మన్, సభ్య కార్యదర్శులు మాత్రమే వెళుతున్నారు.

రాష్ట్రం ఎజెండా ఇదే... ఈ నెల 15వ తేదీన జరిగే సమావేశానికి తెలంగాణ ప్రభుత్వం ఎజెండాను కేంద్రానికి పంపించింది. ఇందులో ప్రధానంగా 811 టిఎంసి కృష్ణా నది కేటాయింపుల్లో నదీ పరివాహకం ఆధారంగా 574 టిఎంసిల వాటా కావాలని కోరింది. పట్టిసీమ ప్రాజెక్టు, పోలవరం నీటిమళ్లింపుల్లో వాటాను ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. దీంతో పాటు బచావత్ ట్రిబ్యునల్‌లో స్పష్టం చేసిన విధంగా తాగునీటి వినియోగంలో 20 శాతం మాత్రమే లెక్కలోకి తీసుకోవాలన్న వాదనను కూడా లేవనెత్తనున్నా రు. సమైక్య రాష్ట్రంలో మొదలుపెట్టిన రాజోలి బండ నీటి మళ్లింపు పథకం (ఆర్‌డిఎస్) ఆధునీకరణ పనులను ఎపి ముందుకు సాగనీయడం లేదని కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళనున్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో భద్రాచలం పట్టణం, దేవాలయానికి ప్రమాదం ఉందని, దీని నివారణకు ఎం చేస్తారని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించనుంది. కృష్ణా బోర్డు ఎపి ప్రభుత్వం పట్ల పక్షపాతం చూపుతోందని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అడ్వాన్స్ రుణం?

(మొదటిపేజీ తరువాయి)

చేసి పూర్తిస్థాయిలో ఫలాలు లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ఆ మేరకు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని కోణాల నుంచి ఇప్పటికే ఆలోచన చేయడం ప్రారంభించింది.

ఇదేమి ప్రసంగం?

(మొదటిపేజీ తరువాయి)

అందుకు పార్లమెంటు వేదిక కాదని, బహిరంగ సభల్లో అలాంటి వ్యాఖ్యలు చేయాలన్నారు. దేశం ముందు మూడు, నాలుగు సమస్యలున్నాయని...రైతులకున్న భవిష్యత్తు ఏమిటి, యువతకు ఉద్యోగాలు ఎలా కల్పిస్తారు, రాఫెల్ ఒప్పందంలో కుంభకోణం జరిగిందా లేదా?అనేవని ఉటంకించారు. 'మాకు మూడు ప్రశ్నలున్నాయి. పారిస్‌లో మీరు కాంట్రాక్టును మార్చారా, రక్షణపై మీరు క్యాబినెట్ కమిటీని అడిగారా, ఆ విమానానికి మీరు ఎంత ధర చెల్లించారు?' అని రాహుల్ గాంధీ నిలదీశారు. రాహుల్ గాంధీ అభిప్రాయాలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ కూడా బలపరుస్తూ 'మోడీ ప్రసంగంలో కొత్త విషయాలు ఏమి లేవు. చెప్పినవే మళ్లీ చెప్పారు' అన్నారు.

కాగా కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ 'ప్రధాని మంచి వక్త, కానీ ఆయన ప్రసంగంలో చెప్పేవి అసాధ్యాలు, అసంపూర్తయిన అంశాలే ఉన్నాయి' అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తెలిపారు. యువత ఉపాధి అంశాన్ని ప్రస్తావించలేదని, ప్రజలు తమ భవిష్యత్ కోసం కోటి ఆశలు పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజలు ఉపాధి కోరుకుంటున్నారని..ఉపన్యాసాలు కాదని మోడీకి సోనియా హితవు పలికారు.

కవాతులో పాల్గొన్న గీతం విద్యార్థి



మన తెలంగాణ/హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని నిర్వహించిన కవాతులో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ సింగిరెడ్డి వెంకట్‌సాయిరెడ్డిని వర్సిటీ అదనపు ఉపకులపతి ఎన్.శివప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డివివిఎస్ వర్మ, సిహెచ్ సంజయ్,ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ పి.వి.నాగేంద్రకుమార్, డాక్టర్ పి.వాసుదేవనాయుడులు అభినందించారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన వెంకట్‌సాయిరెడ్డి, తెలంగాణ రాష్ట్రం నుంచి గణతంత్ర కవాతులో పాల్గొన్న ముగ్గురు బాలురలో ఒకరు.

ఆర్‌ఎస్‌ఐ అభ్యర్థులకు 20 నుంచి శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: గత ఏడాది ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ జోన్ 6లో ఆర్మ్‌డ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికైన అభ్యర్థులు (మహిళలు, పురుషులు) ఈ నెల 17,18 తేదీలలో అంబర్‌పేటలోని ఎస్‌ఎఆర్ సిపిఎల్ పోలీసు గ్రౌండ్‌లో హాజరు కావాలని వెస్ట్‌జోన్ ఐజి స్టిఫెన్‌రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఉదయం10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు రావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్, ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస,కుల,ఆధార్‌కార్డు తదితర ధృవీకరణ పత్రాలు వెంట తీసుకురావల్సిందిగా స్టిఫెన్ రవీంద్ర సూచించారు. వీరందరికి 20వ తేదీ నుంచి పోలీసు అకాడమీలో శిక్షణ ఉంటుందని తెలిపారు.

రాష్ట్రంలో తమిళనాడు అధ్యయనం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ అమలు చేస్తున్నసంస్కరణలపై తమిళనాడు పౌరసరఫరాల శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. గత నెలలో తమిళనాడు కు చెందిన ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సుధారాణి పరిశీలించగా, గత రెండు రోజులుగా ఆ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సిఐడి, అదనపు డిజిపి డాక్టర్ ప్రతీప్,ఐపిఎస్ అధికారి వి.ఫిలి ప్ పరిశీలిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, టి–రేషన్ యాప్, గోదాముల్లో సిసి కెమెరాల పనితీరు, చింతల్‌బస్తీలోని రేషన్ షాపులో ఇ–పాస్ మెషిన్ పనితీరును పరిశీలించారు. కమిషనర్ సి.వి. ఆనంద్‌తో సమావేశమై తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధానాలు, రేషన్ లావాదేవీలను సామాన్య ప్రజలు సైతం తెలుసునేలా రూపొందించిన టి–రేషన్ యాప్ బాగున్నదని ప్రశంసించారు. తమిళనాడులో దాదాపు 40 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, రేషన్ అక్రమ రవాణా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ, కనీస మద్దతు ధర కు ధాన్యం కొనుగోలు చేసి, చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోనే జమచేసేలా ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్(ఒపిఎంఎస్) విధానాన్ని ప్రవేశపెట్టామని వివరించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్ల కార్యాలయాలలో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల ఘనత

మన తెలంగాణ / హైదరాబాద్ : రహదారులపై వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహిస్తోంది.ఇందులో భాగంగా గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సు లక్ష కిమీ రాకపోకల గమ్యాన్ని బుధవారం నాడు పూర్తి చేసింది. హైదరాబాద్–బెంగళూరు, ఢిల్లీ–గోవా, బెంగళూరు– రాజ్‌కోట్ మార్గాల్లో రోజు వారీగా రాకపోకలను సాగిస్తూ రెండు బస్సులు ఒక్కోటి 50వేల కి.మీ చొప్పున లక్ష కి.మీ గమ్యాన్ని పూర్తి చేశాయి. స్మార్ట్ సిటీస్ కార్యక్రమంలో పాల్గొనే రాష్ట్ర రవాణా సంస్థల బస్సులకు తమ సేవలను అందించేందుకు ఆసక్తిగా ఉన్నామని ఈ సందర్భంగా జిఐఎల్ ఎమ్‌డి ఎస్‌కె. రావల్ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష కి.మీ దూరం ప్రయాణించడం ద్వారా దేశంలో ఈ మైలు రాయిని అధిగమించిన మొదటి కంపెనీగా జిఐఎల్ ఆవిర్భవించిందన్నారు.

నేపాల్‌లో ఎన్నికలు ప్రశాంతం

ఖట్మాండ్: నేపాల్ జాతీయ అసెంబ్లీకి బుధవారం ఆరు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో 99 శాతానికి పైగా భారీ పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. 2015లో అమల్లోకి వచ్చిన కొత్త రాజ్యాంగం ప్రకారం మొదటిసారిగా ఎన్నికలు జరిగాయి. కాగా, దక్షిణ నేపాల్‌లోని 6వ ప్రావిన్స్‌లో సభ్యులంతా పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఈ ప్రావిన్స్‌లలో మొత్తం 56 స్థానాలు ఉండగా, ఇప్పటికే 24 మంది అభ్యర్థులు పోటీ లేకుండా ఎన్నికయ్యారు. మిగతా 32 సీట్లకు గానూ 52 మంది బరిలో ఉన్నారు.

చిన్న పిల్లలూ ఇలా ప్రవర్తించరు

టిడిపి, వైసిపి సభ్యులపై స్పీకర్ ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్‌సభలో టిడిపి, వైసిపి ఎంపిలు రెండో రోజు తమ నిరసనను కొనసాగించారు. లోక్‌సభ ప్రారంభ కాగానే ఎపికి న్యాయం చేయాలని, నిధులు కేటాయించాలని టిడిపి, వైసిపి ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. జీరో అవర్‌లో ఇరు పార్టీలకు చెందిన 15 మంది ఎంపిలు మూకుమ్మడిగా వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు తెలిపారు. తమ సీట్లలోకి వెళ్లాలని పదే పదే చెప్పి విసిగి పోయిన స్పీకర్ సుమిత్రా మహాజన్, వారి ప్రవర్తన సరిగా లేదని, చిన్న పిల్లలు సైతం ఇలా ప్రవర్తించరని పేర్కొన్నారు. మీరు ఇంటికి వెళ్లిన తర్వాత మీ పిల్లలకు కూడా క్రమ శిక్షణ నేర్పలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా మరో మార్గం ద్వారా ఎపికి సహాయమందిస్తామని మంగళవారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హామీ ఇచ్చినప్పటికీ ఇరు పార్టీల నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

సిపిఐ(ఎం) కార్యదర్శిగా తమ్మినేని

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం రెండవ సారి ఎన్నికయ్యారు. నల్లగొండలో ఈ నెల 4న ప్రారంభమైన సిపిఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలు బుధవారం ముగిశాయి. చివరి రోజున 60 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా తమ్మినేని వీరభద్రం,ఎస్.వీరయ్య, సిహెచ్.సీతారాములు, జి.నాగ య్య, చుక్క రాములు, నంద్యాల నర్సింహ్మారెడ్డి, సున్నం రాజయ్య, బి.వెంకట్, టి.జ్యోతి,జూలకంటి రంగారెడ్డి,పోతినేనిసుదర్శన్‌రావు, జి.రాములు, డిజి.నర్సింహారావులు మరో సారి ఎన్నికయ్యారు. సిపిఐ(ఎం) నూతన రాష్ట్ర కమిటీలోకి మల్లు స్వరాజ్యం,సారంపల్లి మల్లారెడ్డి, పి.రాజారావులను ప్రత్యేక ఆహ్వానితులుగా తీసుకున్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ మహాసభల్లో మొత్తం పది తీర్మానాలను ఆమోదించారు.

రేపటి నుండి అగ్రిటెక్ సదస్సు

మన తెలంగాణ/ హైదరాబాద్ :ప్రొ. జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఈ నెల 9 నుండి 11 వరకు అగ్రి టెక్ –సౌత్ 2018 జాతీయ సదస్సు జరుగునుంది. ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రొ.జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీతో కలిసి సిఐఐ నిర్వ హిస్తోంది. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ఇటీవల ప్రధాని తెలిపిన ఏడు పాయింట్ల అజెండాతో ఈ సమావేశం కొనసాగనుంది. పంటల మార్పిడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానం, ఈ నామ్, క్రాప్ ఇన్సూరెన్స్, పౌల్ట్రీ, పాడి పరిశ్రమ, కొత్త వంగడాలు, టెక్నాలజీ వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సం దర్భంగా రైతాంగం కోసం వందకు పైగా స్టాళ్లు ప్రదర్శించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని సిఐఐ బుధవారం నాడు హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ కార్య క్రమంలో సిఐఐ తెలంగాణ అగ్రి కల్చర్ ప్యానెల్ కన్వీనర్ పి. గోపాల కృష్ణ, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు కె.విజయ కుమార్, జయ శంకర్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. వి. ప్రవీణ్ రావు, సిఐఐ అగ్రిటెక్ సౌత్ 2018 ఛైర్మన్ అనిల్ కుమార్ విఠపుర్, సిఐఐ తెలంగాణ వైస్ ఛైర్మ న్ సంజయ్ సింఘ్, సిఐఐ తెలంగాణ డైరెక్టర్ అండ్ హెడ్ ఎస్‌వి. రాజీవ్ నాగ్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్

మన తెలంగాణ / హైదరాబాద్ : కొత్త ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఈ నెల 9వ తేదీన ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. సంవత్సరం జనవరి నాటికి 18 ఏళ్ళ వయసు నిండినవారు ఓటర్ల జాబితాలో వారి పేరును నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనూప్‌సింగ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయ సేవా పథకం) సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు వారివారి విద్యాసంస్థల్లోనే దరఖాస్తులను భర్తీ చేసి సమర్పించవచ్చునని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ విష్ణుదేవ్ ఈ కార్యక్రమాన్ని సమన్వయిస్తున్నారని, ఆయా కళాశాలల్లోని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ల ద్వారా కొత్త ఓటర్లుగా విద్యార్థులు చేరవచ్చునని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితాను 14వ తేదీకి రూపొందిస్తున్నందువల్ల 9వ తేదీన ఒక్కరోజు జరిగే ఓటర్ల నమోదు కార్యక్రమంలో 18 ఏళ్ళ వయసు నిండినవారంతా పేర్లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

షేన్‌వార్న్ రాకపై తొలగని సస్పెన్స్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ మళ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కనిపించనున్నాడు. రానున్న సీజన్‌లో అతని సేవలను ఉపయోగించుకోవాలని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం భావిస్తున్నట్టు సమాచారం. కెప్టెన్‌గా ఐపిఎల్ తొలి సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను విజేతగా నిలిపిన ఘనత వార్న్ సొంతం. తొలి టోర్నమెంట్‌లో వార్న్ ఐపిఎల్‌లో తనదైన ముద్ర వేశాడు. తర్వాత కూడా చాలా ఏళ్ల పాటు రాజస్థాన్ రాయల్స్‌కు వివిధ హోదాల్లో పని చేశాడు. బౌలర్, ఆటగాడిగా, కోచ్‌గా త్రిపాత్రాభినయం చేసిన విషయం తెలిసిందే. కాగా, రెండేళ్ల నిషేధం తర్వాత మళ్లీ ఐపిఎల్ బరిలోకి దిగుతున్న రాజస్థాన్ రాయల్స్ షేన్ వార్న్ సేవలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. అతనికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు జట్టు యాజమాన్యం ఎంతో ఆసక్తి కనబరుస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన వెల్లడి కాలేదు. అంతేగాక వార్న్ కూడా తాను దీనికి సిద్ధమా కాదా అనే విషయంపై స్పందించలేదు. త్వరలోనే దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రెండేళ్ల తర్వాత బరిలోకి దిగుతున్న రాజస్థాన్ ఈసారి మెరుగైన ప్రదర్శన కనబరచాలనే పట్టుదలతో ఉంది.



ముంబయి కోచ్‌గా లసిత్ మలింగ

ముంబయి: ఐపిఎల్‌లో పదేళ్లుగా ముంబయి ఇండియన్స్‌కు ప్రాతినిథ్యం శ్రీలంక సీనియర్ బౌలర్ లసిత్ మలింగ ఇప్పుడు కొత్త అవతారం ఎత్తనున్నాడు. ఇటీవల జరిగిన ఐపిఎల్ వేలం పాటలో మలింగను కొనేందుకు ఏ ఫ్రాంచైజీ ముందుకు రాలేదు. దీంతో బౌలర్‌గా అతను మళ్లీ ఐపిఎల్‌లో బరిలోకి దిగే అవకాశాలు దాదాపు ముగిసిపోయినట్టే. అయితే తాను పదేళ్లుగా ప్రాతినిథ్యం వహించిన ముంబయి ఇండియన్స్ యాజమాన్యం మలింగ సేవలను కోచ్‌గా ఉపయోగించుకునేందుకు ముందుకు వచ్చింది. పదకొండో సీజన్‌లో మలింగను బౌలింగ్ సహాయక కోచ్‌గా నియమించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఇప్పటికే శ్రీలంకకు చెందిన దిగ్గజం మహేల జయవర్ధనే ముంబయి ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అంతేగాక బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ స్టార్ షేన్ బాండ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా, మలింగను బాండ్ సహాయకుడిగా ఎంపిక చేశారు. కొత్త సీజన్‌లో మలింగ సేవలు యువ బౌలర్లకు ఎంతో అవసరమని, దీంతో అతన్ని బౌలింగ్ మెంటర్‌గా నియమించినట్టు జట్టు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. కాగా, బౌలింగ్ కోచ్ నియమించడంపై మలింగ ఆనందం వ్యక్తం చేశాడు. ముంబయి తనకు సొంత జట్టులాంటిదని, దీని కోసం ఏ బాధ్యతనైన మోసేందుకు తాను సిద్ధమేనని స్పష్టం చేశాడు.



చెలరేగిన మాక్స్‌వెల్ ఇంగ్లాండ్‌పై ఆసీస్ గెలుపు

హోబర్ట్: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా బుధవారం ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టి–20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన ఆస్ట్రే



లియా 18.3 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 4 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాను మాక్స్‌వెల్ మెరుపు శతకంతో ఆదుకున్నాడు. ఓపెనర్ షార్ట్ (30) అండతో మాక్స్‌వెల్ చెలరేగి పోయాడు. ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురు దాడికి దిగిన మాక్స్‌వెల్ వరుస ఫోర్లు, సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. చూడచక్కని షాట్లతో ఇంగ్లాండ్ బౌలర్లను హడలెత్తించాడు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన మాక్స్‌వెల్ 58 బంతుల్లోనే 4 భారీ సిక్సర్లు, మరో పది ఫోర్లతో 103 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. షార్ట్ రెండు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 30 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను డేవిడ్ మలాన్ ఆదుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న మలాన్ ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 38 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. ఓపెనర్ అలెక్స్ హెల్స్ 4 ఫోర్లతో (22), కెప్టెన్ మోర్గాన్ రెండు ఫోర్లు, సిక్స్ (22) తమ వంతు పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేస్తూ ఇంగ్లాండ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.



జులన్ @ 200

భారత స్టార్ బౌలర్ జులన్ గోస్వామి అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరి గిన రెండో వన్డే సందర్భంగా జులన్ కెరీర్‌లోనే అత్యుత్తమ మైన ఫీట్‌ను సాధించింది. సౌతాఫ్రికా ఓపెనర్ లౌరాను ఔట్ చేయడం ద్వారా తన కెరీర్‌లో 200వ వన్డే వికెట్‌ను సొంతం చేసుకుంది. మహిళల వన్డే చరిత్రలో ఓ బౌలర్ 200 వికెట్ల ఫీట్‌ను సాధించడం ఇదే తొలిసారి. ఇప్పటి వరకు 166 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన గోస్వామి 200వ వికెట్‌ను జమ చేసుకుంది. మహిళల వన్డేల్లో ఓ బౌలర్ 200వ వికెట్లను పూర్తి చేయడం ఇదే ప్రథమం. అంతకుముందు పురుషుల విభాగంలో కూడా కపిల్‌దేవ్ 200 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. మహిళల విభాగంలో గోస్వామి ఈ ఫీట్‌ను సాధించి అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఆస్ట్రే లియా బౌలర్ ఫిట్జ్ పాట్రిక్ (180) రెండో స్థానంలో నిలి చింది. తొలి మ్యాచ్‌లో గోస్వామి నాలుగు వికెట్లతో చెలరే గిన విషయం తెలిసిందే. ఈసారి మాత్రం ఒకే ఒక వికెట్‌ను దక్కించుకుంది. కాగా, 200వ వికెట్‌ను సాధించిన గోస్వామిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మాజీ క్రికెటర్లు సచిన్, సెహ్వాగ్, కపిల్, అజారుద్దీన్, హర్భజన్ తదితరులు గోస్వామిపై ప్రశంసల వర్షం కురిపించారు. అరుదైన ఫీట్‌తో దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిందని పేర్కొన్నారు.



మందన మెరుపులు

రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు, సిరీస్ కైవసం

కిమ్‌బర్లి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను భారత మహిళా క్రికెట్ జట్టు మరో మ్యాచ్ మిగిలివుండగానే కైవసం చేసుకుంది. బుధవారం డైమండ్ ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఇదే క్రమంలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలివుండగానే 2–0తో సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళా జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక 124 పరుగులకే కుప్పకూలింది.

టపటపా...

భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా మహిళా జట్టుకు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ లౌరా (9), వన్ డౌన్‌లో వచ్చిన వికెట్ కీపర్ త్రిషా చెట్టి (6), అంద్రి స్టెయిన్ (3), సునె లూస్ (2) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ లిజెలి లి ఒంటరి పోరాటం కొనసాగించింది. భారత బౌలర్లపై ఎదురు దాడికి దిగిన లి 75 బంతుల్లో ఏడు ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 73 పరుగులు చేసింది. మిగతా వారు విఫలం కావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 124 పరుగుల వద్దే ముగిసింది. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్ నాలుగు, రాజేశ్వరి గైక్వాడ్, దీప్తి శర్మలు రెండేసి వికెట్లు పడగొట్టారు. మరోవైపు వెటరన్ ఫాస్ట్ బౌలర్ జులన్ గోస్వామి వన్డేల్లో 200వ వికెట్‌ను సాధించి చరిత్ర సృష్టించింది. ఓపెనర్ లౌరాను ఔట్ చేయడం ద్వారా గోస్వామి వన్డేల్లో 200వ వికెట్‌ను తన ఖాతాలో జమ చేసుకుంది. వన్డే చరిత్రలో ఓ మహిళా బౌలర్ ఇన్ని వికెట్లు తీయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

మందన మెరుపులు...

అంతకుముదు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మందన, పూనమ్ రౌత్‌లు శుభారంభం అందించారు. ఇద్దరు ధాటిగా ఆడడంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన పూనమ్ రౌత్ 3ఫోర్లతో 20 పరుగులు చేసి ఔటైంది. ఈ క్రమంలో56 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంలో పాలుపంచుకుంది. మరోవైపు కెప్టెన్ మిథాలీ కూడా కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడింది. మిథాలీ అండతో మందన విశ్వ రూపమే ప్రదర్శించింది. దక్షిణాఫ్రికా బౌలర్లను హడలెత్తిస్తూ పరుగుల వరదను పారించింది. చెలరేగి ఆడిన మందన వరుస ఫోర్లతో స్కోరును పరిగెత్తించింది. ధాటిగా ఆడిన మందన 129 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్స్‌తో 135 పరుగులు చేసింది. మిథాలీ (20) పరుగులు సాధించింది. చివరల్లో హర్మన్‌ప్రీత్ కౌర్, వేద కృష్ణమూర్తిలు అజేయ అర్ధ శతకాలతో జట్టుకు అండగా నిలిచారు. ధాటిగా ఆడిన వేద 33 బంతుల్లో ఒక సిక్స్, ఆరు ఫోర్లతో 51 పరుగులు చేసింది. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన కౌర్ 55 పరుగులతో అజేయంగా నిలిచింది. దీంతో భారత్ స్కోరు 302కు చేరింది.


స్మృతి మందన
135

స్కోరుబోర్డు

భారత్ ఇన్నింగ్స్: పూనమ్ రౌత్ (సి) చెట్టి (బి) మసబత్తా కియాస్ 20, స్మృతి మందన (సి) చెట్టి (బి) రైసిబి నౌజాకె 135, మిథాలీరాజ్ (సి) అండ్ (బి) సునె లూస్ 20, హర్మన్‌ప్రీత్ కౌర్ నాటౌట్ 55, వేదా కృష్ణమూర్తి నాటౌట్ 51, ఎక్స్‌ట్రాలు 21, మొత్తం 50 ఓవర్లలో 302/3.
బౌలింగ్: అయబొంగా ఖాకా 8–0–63–0, మరిజానె కాప్ 9–0–41–0, మసబత్తా కియాస్ 9–0–65–1, నికార్క్ 10–1–38–0, రైసిబి నౌజాకె 9–0–63–1, సునె లూస్ 5–0–31–1.
దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లిజెలి లి ఎల్బీ (బి) దీప్తి శర్మ 73, లౌరా వాల్‌వర్డ్‌ట్ (సి) సుష్మా వర (బి) జులన్ గోస్వామా 9, త్రిషా చెట్టి (సి) మెశ్రమ్ (బి) రాజేశ్వరి గౌక్వాడ్ 6, అంద్రి స్టెయిన్ (సి) వేద (బి) పూనమ్ యాదవ్ 3, సునె లూస్ (సి) వేద (బి) పూనమ్ యాదవ్ 2, చిస్ ట్రయన్ రనౌట్ 1, మరజానె కాప్ నాటౌట్ 17, అబబొంగా ఖాకా (బి) దీప్తి శర్మ 0, మసబత్తా కియాస్ (బి) పూనమ్ యాదవ్ 4, రైసిబి నౌజాకె ఎల్బీ (బి) పూనమ్ యాదవ్ 0, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 30.5 ఓవర్లలో 124 ఆలౌట్.
బౌలింగ్: జులన్ గోస్వామి 7–0–29–1, శిఖా పాండే 4–1–23–0, రాజేశ్వర్ గైక్వాడ్ 6–0–14–2, పూనమ్ యాదవ్ 7.5–1–24–4, దీప్తి శర్మ 6–1–34–2.



ఇది ద్రవిడ్ మార్క్ విజయం

• సునీల్ గవాస్కర్



ముంబయి: రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలో భారత యువ క్రికెట్ జట్టు ఎంతో రాటుదేలిందన్నాడు. అండర్–19 ప్రపంచకప్‌ను భారత్ సాధించిందంటే దానికి ముందుచూపుతో ద్రవిడ్ తీసుకున్న చర్యలే కారణమన్నాడు. భారత జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ద్రవిడ్ పోషించిన పాత్ర మాటల్లో వర్ణించేలమన్నాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండానే ప్రపంచకప్‌ను గెలుచుకోవడం ఎంతటి జట్టుకైనా చాలా కష్టమన్నాడు. అయితే ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న భారత యువ జట్టు దీన్ని ఆచరణలో చేసి చూపించిందన్నాడు. ప్రస్తుతం భారత యువ జట్టులో గెలవాలనే పట్టుదల అధికంగా కనిపిస్తుందన్నాడు. జట్టులో ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం ద్రవిడే అనడంలో ఎటువంటి సందేహం లేదన్నాడు. ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా ద్రవిడ్ తన పాత్రలను చాలా సమర్థంగా నిర్వర్తించాడని గవాస్కర్ ప్రశంసించాడు. ఇటువంటి ఆటగాడు లభించడం భారత్‌కు గర్వించదగ్గ విషయమన్నాడు.



తాను చూసిన అత్యుత్తమ ప్రదర్శనల్లో యువ భారత జట్టు ఆట ఒకటన్నాడు. ప్రపంచకప్‌లో భారత జట్టు ఆత్మవిశ్వాసం ఆకాశాన్ని అంటిందన్నాడు. ఆటగాళ్లలో గెలవాలనే పట్టుదలను నూరి పోయడంలో ద్రవిడ్ ఎంతో సఫలమయ్యాడన్నాడు. దీని ఫలితమే యువ జట్టు ఒక్క మ్యాచ్ కూడా కోల్పోకుండానే అలవోకగా ప్రపంచకప్‌ను సొంతం చేసుకుందన్నాడు.

కోహ్లి సేన ఆట అద్భుతం...

మరోవైపు వన్డే సిరీస్‌లో భారత సీనియర్ జట్టు వరుసగా రెండు మ్యాచ్‌లు గెలవడం తనను ఎంతో ఆనందానికి గురి చేసిందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలోపేతంగా మారిందన్నాడు. కోహ్లి సారథిగా జట్టును నడిపిస్తున్న తీరుపై గవాస్కర్ ప్రశంసలు కురిపించాడు. టెస్టు సిరీస్‌లో ఓటమితో కోహ్లిలోని కసి బయటకు వచ్చిందన్నాడు. దీని ప్రభావం చివరి టెస్టులో స్పష్టంగా కనిపించిందన్నాడు. తనపై వచ్చిన విమర్శలకు గెలుపుతోనే జవాబివ్వాలనే పట్టుదలతో కోహ్లిలో కనిపిస్తుందన్నాడు. దీంతో భారత్ చివరి టెస్టుతో పాటు రెండు వన్డేలలో ఘన విజయం సాధించిందన్నాడు. ఇదే కసితో ఆడితే వన్డే సిరీస్‌ను గెలుచుకోవడం కోహ్లి సేనకు కష్టం కాదన్నాడు. మరోవైపు కీలక ఆటగాళ్లు డివిలియర్స్, డుప్లెసిస్, డికాక్‌ల సేవలు కోల్పోవడం కూడా భారత్‌కు కలిసి వచ్చిందన్నాడు. వారు ఉన్నా భారత్‌ను విజయం సాధించకుడా ఆపడం సఫారీలకు అంత సులువు కాదని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.



భారత్ రికార్డు విజయం

- కోహ్లి శతకం, రాణించిన ధవన్, మళ్లీ చెలరేగిన స్పిన్నర్లు
- మూడో వన్డేలోనూ సఫారీ చిత్తు

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో భారత్ 124 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 3–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. స్పిన్ ద్వయం యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు మరోసారి చెలరేగడంతో భారత్‌కు రికార్డు విజయం దక్కింది. ఈ విజయంతో భారత్ చరిత్ర సృష్టించింది. సౌతాఫ్రికా గడ్డపై వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి కొత్త రికార్డును నెలకొల్పింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. బుమ్రా తన తొలి బంతికే హాషిం ఆమ్లాను వెనక్కి పంపాడు. అయితే తర్వాత వచ్చిన డుమినితో కలిసి కెప్టెన్ మార్క్రామ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే స్కోరు వేగం తగ్గకుండా చూశారు. అయితే మార్క్రామ్ (32)ను కుల్దీప్ వెనక్కి పంపి సౌతాఫ్రికా వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన డుమినిన 4 ఫోర్లతో 51 పరుగులు చేసి చాహల్ బౌలింగ్ ఔటయ్యాడు. తర్వాత సఫారీలు మళ్లీ కోలుకోలేదు. చాహల్, కుల్దీప్‌లు నాలుగేసి వికెట్లు పడగొట్టి సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌ను 179 పరుగులకే పరిమితం చేశారు.



చెలరేగిన కోహ్లి, ధావన్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను ఓపెనర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లిలు ఆదుకున్నారు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ (0) ఖాతా తెరవకుండానే తొలి ఓవర్‌లోనే ఇంటిదారి పట్టాడు. అయితే కోహ్లి, ధావన్‌లు అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. ఇద్దరు సౌతాఫ్రికా బౌలర్లు సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును పరిగెత్తించారు. చెలరేగి ఆడిన ధావన్ 12 ఫోర్లతో 76 పరుగులు చేశాడు. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి 159 బంతుల్లో 12 ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 160 పరుగులు చేశాడు. ఈ క్రమంలో కోహ్లి తన ఖాతాలో 34వ వన్డే శతకాన్ని నమోదు చేశాడు. కోహ్లి రాణించడంతో భారత్ స్కోరు 303కు చేరింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.